



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


## 28న రాష్ట్ర క్యాబినెట్ భేటీ

*అమరావతి (చైతన్యరథం): ఈనెల 28న సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరుగుతుంది. 2025-26 రాష్ట్ర బడ్జెట్ కు క్యాబినెట్ ఆమోదం తెలపనుంది.*

# మిర్చి రైతులను ఆదుకుంటాం



- వ్యాపారులు, ఎగుమతిదారులు సహకరించాలి
- క్వింటా మిర్చి ధర రూ.11,781 కంటే తగ్గితే కేంద్రం ద్వారా కొనుగోలు
- కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునే రైతులకు బ్యాంకు రుణాల మంజూరుకు చర్యలు
- కృష్ణపట్నం పోర్టు ద్వారా మిర్చి కంటెయినర్ల రవాణాకు అనుమతులు
- గుంటూరులోని స్పైస్ పార్కులో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
- రెండున్నర గంటలపాటు మిర్చి రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులు, కమీషన్ ఏజెంట్లు, అధికారులతో సీఎం సమావేశం
- గుంటూరు మార్కెట్ యార్డులో లారీ యజమానుల తీరుపై రైతుల ఫిర్యాదు..చర్యలకు సీఎం ఆదేశం

- వివరాలు 2లో...




## సభాపర్వం

- రేపటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- తొలిరోజు గవర్నర్ ప్రసంగం, బీఏసీ సమావేశం
- 25న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చ
- 28న బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం
- సమావేశాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

2



## అమరావతిలో మళ్లీ వెలుగులు

- వచ్చే 15 నుంచి రాజధాని నిర్మాణపనులు ప్రారంభం
- ప్రాధాన్య ప్రాజెక్ట్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక టెండర్లు ఖరారు
- తరువాత ఊపందుకోనున్న పనులు

6

## రాయలసీమలో ప్రతి ఎకరాకూ నీరందిస్తాం

- సాగులో సాంకేతికతకు సీఎం చంద్రబాబు పెద్దపీట
- రైతుద్రోహి జగన్ దొంగ నాటకాలు
- 'రైతు బడి-అగ్రి షో' ప్రారంభ కార్యక్రమంలో మంత్రి సవిత

3

## పేద విద్యార్థులకు ప్రభుత్వం ఎంతైనా భరిస్తుంది

5

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- రేపల్లె గురుకుల బాలికల పాఠశాల తనిఖీ

## ఇది రైతు ప్రభుత్వం.. ఏ సమస్యా రానివ్వం

5

- మార్కెట్‌ను బట్టి గిట్టుబాటు ధరకు చర్యలు
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

## ఇళ్లస్థలాల పేరుతో వైసీపీ సర్పంచ్ టోకరా

- రూ.12 లక్షలు వసూలు చేసి మోసం
- విజయనగరం జిల్లా బాధితుల ఫిర్యాదు
- ఆటస్థలం కబ్జా చేసి వైసీపీ నేతల నిర్మాణాలు
- స్కూల్ విద్యాకమిటీ సభ్యుల ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన నెట్టెం రఘురాం, దేవేంద్రప్ప

4

# మిర్చి రైతులను ఆదుకుంటాం

- వ్యాపారులు, ఎగుమతిదారులు సహకరించాలి
- క్వింటా మిర్చి ధర రూ.11,781 కంటే తగ్గితే కేంద్రం ద్వారా కొనుగోలు
- కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునే రైతులకు బ్యాంకు రుణాల మంజూరుకు చర్యలు
- కృష్ణపట్నం పోర్టు ద్వారా మిర్చి కంటెయినర్ల రవాణాకు అనుమతులు
- గుంటూరులోని స్పైస్ పార్కులో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
- రెండున్నర గంటలపాటు మిర్చి రైతులు, వ్యాపారులు, ఎగుమతి దారులు, కమీషన్ ఏజెంట్లు, అధికారులతో సీఎం సమావేశం
- గుంటూరు మార్కెట్ యార్డులో లారీ యజమానుల తీరుపై రైతుల ఫిర్యాదు.. చర్యలకు సీఎం ఆదేశం



అమరావతి (చైతన్యరథం): ధర పతనమై ఇబ్బందులు పడుతున్న మిరప రైతులను గట్టెక్కించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దీనికి ఎగుమతి దారులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు సహకరించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో మిరప రైతులను ఆదుకోవాలన్నదే తన తాపత్రయం అని చెప్పారు. మిర్చి ధరలు తగ్గి రైతులు ఇబ్బందులు పడతున్నారన్న అంశం తన దృష్టికి వచ్చిన వెంటనే గతేడాది డిసెంబర్ 26, ఈ ఏడాది ఫిబ్రవరి 5, 11 తేదీల్లో కేంద్రానికి లేఖ రాశానని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. సచివాలయంలో శనివారం మిర్చి రైతులు, వ్యాపారులు, అధికారులు, ఎగుమతిదారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రైతులు, వ్యాపారులు, ఎగుమతి దారుల నుంచి వారి సమస్యలు, అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

## పెట్టుబడి అధికమవుతోంది

మిరప సాగుకు ఏటికేడు పెట్టుబడి పెరుగుతోందని, పెరిగిన పెట్టుబడి స్థాయిలో తమకు ఆదాయం రావడం లేదని రైతులు.. సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా మిర్చికి నల్లతామర తెగులుతో పంట నాణ్యత తగ్గడంతో పాటు దిగుబడి తగ్గిపోతోందని రైతులు తెలిపారు. ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకూ ఖర్చు అవుతోందని వివరించారు. కూలీ ఖర్చులు ఎప్పుడూ లేని విధంగా ఈ సారి మరింత పెరిగాయన్నారు. అయినా కూలీలు దొరకడం లేదన్నారు. ఎన్నో వ్యయప్రయాసలతో యార్డుకు పంటను తెస్తే ఉదయం పూట నిర్ణయించిన ధర మళ్లీ మచ్చుకు వచ్చిన తర్వాత ఉండటం లేదన్నారు. క్వింటాకు రూ.500 చొప్పున వ్యాపారులు తగ్గిస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే నాణ్యత సరిగా లేనందువల్లే తగ్గిస్తున్నామని వ్యాపారులు సమాధానం చెప్తున్నారని, ఉదయం ఉన్న నాణ్యత మధ్యాహ్నానికే ఎలా తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యార్డుకు టిక్కీలు తేవాలంటే బాడిగకు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని, యూనియన్‌లో లేని లారీలను బాడిగకు తీసుకొస్తే వారిని మిగతా లారీ యజమానులు బెదిరించి, కేసులు పెడుతున్నారని వివరించారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చినట్లు క్వింటాకు ఇంత అని బోనస్ ప్రకటిస్తే రైతులకు మేలు చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.

## కృష్ణపట్నం కంటెయినర్ పోర్టు నుంచి అనుమతించాలి

ఏపీ నుంచి మిరప ఎగుమతులు ఎక్కువగా చైనా, కొలంబో, బంగ్లాదేశ్, ఇండోనేషియాకు సాగుతాయని ఎగుమతి దారులు వివరించారు. అయితే ఈ యేడాది ఆయా దేశాలకు ఎగుమతులు తగ్గడం వల్ల రాష్ట్రంలో మిర్చికి కొంత ధర తగ్గిందని అన్నారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో వచ్చిన వరదల కారణంగా, పురుగుమందులు ఎక్కువగా వినియోగించడం వల్ల, నాణ్యత కొంత దెబ్బతినడం వల్ల డిమాండ్ తగ్గుతోం దని వివరించారు.కోల్డ్ స్టోరేజీల్లో కూడా గత పంటకు సంబంధించిన నిల్వలు అధికంగా ఉండటంవల్ల కొత్తగా వచ్చిన పంట నిల్వచేసుకునేందుకు వీలు లేకుండా పోయిందని, తద్వారా రైతులు నేరుగా యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారని వ్యాపారులు తెలిపారు. రైతులకు ఆర్థిక అవసరాలు వెంటాడుతున్న కారణంగానే వెంటనే పంటను విక్రయిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పండే 60శాతం మిర్చి విదేశాలకు ఎగుమతి అవుతుందని, వివిధ దేశాలకు సరఫరా చేసే 410 మంది ప్రధాన ఎగుమతి దారుల్లో ప్రస్తుతం 250 మంది మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారని వివరించారు. కృష్ణపట్నం కంటెయినర్ టెర్మినల్ ద్వారా మిర్చి కంటెయినర్‌లను అనుమతించడం లేదని, ఈ కారణంగా మద్రాసు పోర్టుకు వెళ్లడం ద్వారా రవాణా ఖర్చులు అధికమయ్యాయని వివరించారు. అదే విధంగా గుంటూరులోని స్పైస్ పార్కులో కనీస సదుపాయాలు లేవని వ్యాపారులు వివరించారు.

## అధిక కిరాయి వసూలుచేస్తే చర్యలు

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ....మిర్చి రైతుల నుంచి కిరాయి ఎక్కువ వసూలు చేసే లారీ యాజమాన్యాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రవాణాను కొందరు తమ గుప్పెట్లో పెట్టుకుని రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించవద్దని అధికారులకు సూచించారు. మిర్చి యార్డులో ఎలక్ట్రానిక్ కాటాలు ఏర్పాటు చేసి మిర్చి టిక్కీలు కాటా వేసిన వెంటనే రైతుల ఫోన్లకు మెసేజ్‌లు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోల్డ్ స్టోరేజీలో టిక్కీలు నిల్వ చేసుకున్న రైతులకు బాండ్ల ఆధారంగా రుణాలు ఇచ్చేలా త్వరలో బ్యాంకర్లతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. గుంటూరులోని స్పైస్ పార్క్‌లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు మిర్చిని కళ్లాల్లో ఆరబెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా అధికారులు తగిన సూచనలు చేయాలన్నారు. శాస్త్రవేత్తలు, అధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో సమావేశమై రసాయనాల తగ్గుదల, పెట్టుబడి ఖర్చులు తగ్గించే అంశంపైనా సలహాలు ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన భూసార పరీక్షలు మళ్లీ ప్రవేశపెడతామని, తద్వారా నేల స్వభావాన్ని బట్టి రైతులు ఏఏ పంటలు సాగుచేసుకోవచ్చునో తెలుసుకోవచ్చు అన్నారు. క్వింటా మిర్చిధర రూ.11,781 కంటే తక్కువగా ఉంటే మార్కెట్ ఇంట్రవెన్షన్ స్కీమ్ కింద కేంద్రం కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని ప్రతిపాదనలు ఉంచినట్లు సీఎం తెలిపారు. దీనికి కేంద్రం అంగీకారం తెలిపిందన్నారు. దీనిలో 50 శాతం కేంద్రం భరిస్తే, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం భరించాల్సి ఉందన్నారు.

అయితే ఈ విధానం అమలు చేస్తే పక్క రాష్ట్రాల్లోని రైతులు, వ్యాపారులు ఏపీకి పంటను తెచ్చి అమ్ముకునే ప్రమాదం ఉందని, తద్వారా ఏపీ రైతులకు న్యాయం జరగదని రైతులు అభిప్రాయ పడ్డారు. దీనిపై కేంద్రంతో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం అన్నారు. 2017లో కూడా ధర పతనమైనప్పుడు వెంటనే తమ ప్రభుత్వం స్పందించి క్వింటాకు రూ.1500 చొప్పున అందించిందని, అందుకు రూ.135కోట్లు ఖర్చు చేశామని సీఎం గుర్తు చేశారు. ఇప్పుడు కూడా రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కష్టాల నుంచి గట్టెక్కించేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు.

## ఈ-క్రాప్ ఆధారంగా రైతులకు సాయం

ఈ-క్రాప్‌లో నమోదైన రైతుల వివరాలు, యార్డులో పంటను అమ్ముకుని రికార్డులో నమోదై ఉన్న వివరాల ఆధారంగా రైతులకు సాయం చేసే అంశాన్ని పరిశీలిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. రైతుల కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి రైతులకు చెందాలే తప్ప మధ్యవర్తులకు, ఇతర వర్గాలకు కాదని స్పష్టం చేశారు. దీని కోసం గత అనుభవాలు కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ఎక్కువగా మామిడి, మిర్చి సాగు ఉన్నందున బోర్డు ఏర్పాటు పైనా త్వరలో చర్చిస్తామని సీఎం తెలిపారు. తక్షణమే కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం, అధికారులతో మాట్లాడి మిర్చి కంటెయినర్‌ల రవాణాకు చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

---

- రేపటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- తొలిరోజు గవర్నర్ ప్రసంగం, బీఏసీ సమావేశం
- 25న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చ
- 28న బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం
- సమావేశాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

# సభాపర్వం

అమరావతి (చైతన్యరథం): ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24 (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగంతో ఉభయసభలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12 గంటలు బీఏసీ సమావేశం జరుగుతుంది. సభ ఎన్ని రోజులు సమావేశం కావాలి, ఏఏ బిల్లులు ప్రవేశపెడతారనే అంశంపై బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ఈనెల 25న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఈనెల 28న సభలో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

## కట్టుదిట్టమైన ఏర్పాట్లు

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో రాకపోకలు, ప్రవేశాలపై నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక పాస్‌లు జారీ చేస్తారు. మీడియా, విజిటర్లు, పోలీసు సిబ్బందికి మరో రకమైన ప్రత్యేక పాస్‌లు జారీ చేస్తారు. భద్రతా కారణాల రీత్యా పాస్‌లు ఉన్నవారినే అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతిస్తారు. అసెంబ్లీ, మండలిలో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేలా వివిధ కలర్ కోడ్‌లతో పాస్ లు జారీ చేస్తారు. అసెంబ్లీ ఒకటో గేట్ నుంచి మండలి ఛైర్మన్, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎంలకు మాత్రమే అనుమతి ఉంటుంది.

అసెంబ్లీ గేట్ 2 నుంచి మంత్రులను మాత్రమే అనుమతిస్తారు. అసెంబ్లీ గేట్ 4 నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మాత్రమే అనుమతి ఉంటుంది. మండలి ఛైర్మన్, స్పీకర్, సీఎం వచ్చి వెళ్లే కారిడార్‌లో ఇతరులకు అనుమతి లేదని స్పష్టం చేసింది. నాలుగో గేట్ గన్ పాయింట్ మినహా భద్రతా సిబ్బందిని అనుమతించేది లేదని వెల్లడించింది. మంత్రులు, సభ్యుల పీఏలను అవసరం మేరకు మాత్రమే అనుమతిస్తారు. శాసనసభా వ్యవహారాలతో సంబంధం లేని ప్రభుత్వ సిబ్బందికి అనుమతి లేదని స్పష్టం చేసింది. శాసనసభ, మండలిలోకి సభ్యులు ఎవరూ ఆయుధాలతో రాకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒకవేళ వచ్చినా ఆయుధాలను ప్రాంగణంలో ఉన్న బెల్ ఆఫ్ ఆర్మ్‌లో డిపాజిట్ చేయాలని సూచించింది.

చైతన్యరథం

# రాయలసీమలో ప్రతి ఎకరాకూ నీరందిస్తాం

- సాగులో సాంకేతికతకు సీఎం చంద్రబాబు పెద్దపీట
- రాయలసీమకు కృష్ణా జలాలు తీసుకొచ్చిన ఘనత టీడీపీదే
- రైతు ద్రోహి జగన్ దొంగ నాటకాలు
- 'రైతు బడి- అగ్రి షో' ప్రారంభ కార్యక్రమంలో మంత్రి సవిత




అనంతపురం/రాప్తాడు (చైతన్యరథం): వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో అధిక దిగుబడులు సాధించొచ్చునని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా సాగులో సాంకేతికతకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రాయలసీమకు కృష్ణా జలాలు తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో శనివారం నుంచి రెండ్రోజుల పాటు జరిగే రైతు బడి–అగ్రి షో కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాల్వ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నాయకుడు పరిటాల శ్రీరామ్‌తో కలసి మంత్రి సవిత ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ, మారుతున్న కాలను గుణంగా వ్యవసాయంలోనూ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఒక వైపు మానవ వనరుల కొరత వేధిస్తున్న సమయంలో సాంకేతికతను వినియోగించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం చంద్రబాబు వ్యవసాయంలో సాంకేతికత వినియోగానికి ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఇప్పటికే వ్యవసాయంలో డ్రోన్లను వినియోగిస్తున్నామన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను 90 శాతం రాయితీపై రైతులకు అందిస్తున్నామన్నారు. వ్యవసాయ, హార్టీకల్చర్ అధికారులు సాంకేతికత వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి సవిత సూచించారు.

### పోలవరం-బనకచర్లతో రాష్ట్రం సస్యశ్యామలం

రాయలసీమలోని ప్రతి ఎకరాకు సాగునీరందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు. రాయలసీమకు కృష్ణా జలాలను తీసుకొచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. రాయలసీమలోని అన్ని ప్రాంతాల్లోనూ సాగు, తాగునీరందిచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అసంపూర్తిగా నిలిచిపోయిన హంద్రీనీవా సుజల స్రవంతి పనులు కూడా ఇటీవలే ప్రారంభించామని గుర్తు చేశారు. 80 వేల కోట్లతో పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రమంతా సస్యశ్యామలమవుతుందన్నారు.

### పరిటాల శ్రీరామ్‌కు అభినందనలు

రైతు బడి–అగ్రి షో కార్యక్రమం పేరుతో వ్యవసాయంలో సాంకేతిక పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న టీడీపీ నాయకుడు పరిటాల శ్రీరామ్‌ను మంత్రి సవిత అభినందించారు. యువత వ్యవసాయంలోకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇందుకు పరిటాల శ్రీరామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయశాఖాధికారులు, వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు సదస్సులో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి సవిత సందర్శించారు. డ్రోన్లు, ట్రాక్టర్లను పరిశీలించారు. అధిక దిగుబడులిచ్చే టమాటా నారును, మామిడి, ఇతర మొక్కలను తిలకించారు.

### రైతు ద్రోహి జగన్

కార్యక్రమంలో అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ, జగన్ పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. టీడీపీ ప్రభుత్వాల హయాంలోనూ, 2019–24 మధ్య కాలంలోనూ వ్యవసాయ అభివృద్ధికి తీసుకున్న చర్యలపై చర్చకు రావాలని జగన్‌కు మంత్రి సవిత సవాల్ విసిరారు. రైతు ద్రోహి అని జగన్ తీవ్రంగా విమర్శించారు. జగన్ 5 ఏళ్ల పాలన రైతుతో పాటు సాగు రంగం కూడా కుదేలైందన్నారు. చంద్రబాబు ఉచితంగా జిప్సం, బోరాన్, జింక్ ఇస్తే...జగన్ వాటిని నిలిపేశాడన్నారు. పురుగుల మందులు, కలుపు మందులు, గడ్డి మందులను చంద్రబాబు రైతుకు 50 శాతం సబ్సిడీపై ఇస్తే...జగన్ వాటిని కూడా నిలిపేశాడన్నారు. చంద్రబాబు హయాంలో మైక్రో ఇరిగేషన్ పరికరాలను 90 శాతం సబ్సిడీతో రైతులకు ఇవ్వగా....వాటిని ఇవ్వకుండా జగన్ చేతులు ఎత్తేశాడన్నారు. మిర్చి పంటపైనా జగన్ దొంగ నాటకం ఆడుతున్నాడని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ ఉంటుండగా గుంటూరు మిర్చి యార్డుకు ఎలా వెళతారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నన్నాళ్లు రైతులను, ప్రజలను పట్టించుకోని జగన్...ఇప్పుడు ఆకస్మాత్తుగా కపట ప్రేమ కురిపిస్తూ దొంగ నాటకమాడుతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు.

# వచ్చేనెలలో కొత్త రేషన్‌కార్డులు

- ఆధునిక టెక్నాలజీతో క్యూ ఆర్ కోడ్ కార్డులు అందిస్తాం
- మహిళలందరూ ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి
- మే నెల నుంచి మధ్యాహ్న భోజనానికి, సంక్షేమ హాస్టళ్లకు సన్నబియ్యం
- రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా వచ్చేనెల నుంచి కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శనివారం నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం సంగంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి నాదెండ్ల పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగం సమీపంలోని రైసుమిల్లును, బహుళ ప్రయోజన సౌకర్య గోదాము (స్టాక్ పాయింట్)ను మంత్రి తనిఖీ చేశారు. రైసుమిల్లును తనిఖీ చేసి ధాన్యం సేకరణకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టాయిపాయింట్‌ను తనిఖీ చేసి స్టాకు వివరాలు, సరఫరా మొదలైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మహిళలనుద్దేశించి మాట్లాడారు. ఇది మహిళా పక్షపాత ప్రభుత్వమన్నారు. మహిళలందరూ కూడా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వచ్చేనెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆధునిక టెక్నాలజీతో క్యూ ఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్‌కార్డులను అందిస్తామని చెప్పారు. రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తామన్నారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన దీపం–2 పథకం హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారని, ఇందులో భాగంగా ఈజిల్లాలో 4లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 93.42లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, ఈ ఏడాది 1.50 కోట్లు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా వున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారం మహిళలందరూ తెలుసుకోవాలని, భాగస్వామ్యం కావాలని సూచించారు. మే నెల నుంచి అన్ని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అహర్నిశలు శ్రమిస్తూ అభి వృద్ధి చేస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ కూడా మంచి పరిపాలన అంది స్తున్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి ఆశీస్సులు అందించాలని కోరారు.

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ స్టాక్ పాయింట్‌ను మంత్రి నాదెండ్ల మనోహర్ క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారని, ఇలాంటి చిత్తశుద్ధి గల నాయకుడు సివిల్ సప్లయిస్ మంత్రిగా వుండడం మనందరి అదృష్టంగా ఎంపీ చెప్పారు. జిల్లాలోని స్టాక్ పాయింట్ల అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తమై ఎటువంటి పొరపాట్లు లేకుండా ప్రజలకు తుకాల్లో తేడాలు లేకుండా నాణ్యమైన వస్తువులను అందించాలని సూచించారు. అన్ని వస్తువులు కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండేలా చూసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవో పావని, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డీసీవో గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

# కుంభమేళాలో పుణ్యస్నానం అత్యున్నత ఆధ్యాత్మిక అనుభవం

**- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**



అమరావతి (చైతన్యరథం): యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహా కుంభమేళాలో పుణ్యస్నానం ద్వారా కలిగే అనుభవం అనిర్వచనీయమైనదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన ప్రయాగ్ రాజ్‌లో మహా కుంభమేళా సందర్భంగా పవిత్ర గంగానదిలో పుణ్యస్నానమాచరిం చారు. ఈ పవిత్ర స్నానం తనను అత్యున్నత ఆధ్యాత్మిక అనుభవంతో పులకింపచేసిందని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ స్నానం సందర్భంగా హైందవ సంస్కృతీ ప్రవాహం విశిష్టతను అనుభవపూర్వకంగా తెలుసుకునే అవకాశం తనకు లభించిందన్నారు. ధనిక, పేద, కుల వ్యత్యాసాలకు అతీతంగా ఆధ్యాత్మిక వికాసానికి హిందూ ధర్మం చూపే విశ్వసనీయ మార్గానికి ఈ మహా కుంభమేళా సజీవ సాక్ష్యమని ఆయన అభివర్ణించారు.

కోట్లాది మంది భక్తులు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రయాగ్ రాజ్ వద్ద పవిత్ర స్నానం చేయటానికి యూపీ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. మహాకుంభమేళాలో పాల్గొని పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరించడం తనకు ఎంతో సంతోషం కలిగించిందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుకలో తాను కూడా భాగస్వామిని కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కోట్లాది మంది ప్రజల నమ్మకాలు, సంప్రదాయాలకు ఈ కుంభమేళా ప్రతీకగా నిలిచిందని, హిందూ సంస్కృతి, ఆధ్యాత్మికతను ప్రపంచానికి చాటిచెప్పిందని ఆయన అభివర్ణించారు.

# ఇళ్లస్థలాల పేరుతో వైసీపీ సర్పంచ్ భారీ టోకరా

- రూ.12 లక్షలు వసూలు చేసి మోసం
- విజయనగరం జిలా బాధితుల ఫిర్యాదు
- ఆట స్థలం కబ్జా చేసి వైసీపీ నేతల నిర్మాణాలు
- స్కూల్ విద్యాకమిటీ సభ్యుల ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన నెట్టెం రఘురాం, దేవేంద్రప్ప



మంగళగిరి(చైతన్యరథం): వైసీపీ గ్రామ సర్పంచ్ గత ప్రభుత్వంలో పేదలకు ఇంటి స్థలాలు ఇప్పిస్తానని చెప్పి వారి నుంచి సుమారు రూ.12 లక్షలు వసూలు చేసి మోసగించాడని విజయనగరం జిల్లా గంట్యాల మండలం నరవ గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజావినతుల కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి పేదల డబ్బులు తిరిగి వెనక్కి ఇచ్చేలా చూడాలని అభ్యర్థించారు. మాజీ మంత్రి నెట్టెం రఘురాం, కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్పలకు అర్జీలు స్వీకరించారు.

– తన ఇంట్లో పనిచేస్తున్న రాజేష్ అనే వ్యక్తి తాను పని మీద బయటకు వెళ్లడంతో ఇంట్లో ఉన్న బంగారం, వెండి, నగదు తీసుకెళ్లాడని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఎల్.జ్యోతీశ్వరి తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వివరించింది. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తమ్ముడి ఇంట్లో రాజేష్ అమ్మ పనిచేస్తుండటంతో కేసు పట్టించుకోవడంలేదని..ఈ దొంగతనంపై విచారించి తమ ఇంట్లో పోయిన డబ్బులు బంగారాన్ని ఇప్పించాలని కోరింది.

– వైసీపీ గ్రామ సర్పంచ్ గత ప్రభుత్వంలో పేదలకు ఇంటి స్థలాలు ఇప్పిస్తానని చెప్పి వారి నుంచి సుమారు రూ.12 లక్షలు వసూలు చేశాడని విజయనగరం జిల్లా గంట్యాల మండలం నరవ గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన వ్యక్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి పేదల డబ్బులు తిరిగి వెనక్కి ఇచ్చేలా చూడాలని అభ్యర్థించారు.

– ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం కోటాలపల్లి గ్రామంలో ప్రభుత్వ స్కూల్ ఆట స్థలాన్ని వైసీపీ పార్టీ లీడర్లు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టగా కోర్టుకు వెళితే ఆ నిర్మాణాలను నిలిపిందని స్కూల్ విద్యా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

– కర్నూలు జిల్లా ఆదోని 21వ వార్డు సచివాలయంలో కంప్యూటర్లు పనిచేయక పోవడంతో ఏ పనిమీద వెళ్లినా సచివాలయ సిబ్బంది ఆ సాకుతో ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని బోయ శకుంతల ఫిర్యాదు చేసింది.

– తమ చేత ఆస్తి రాయించుకుని కుమారులు తమను ఇంటి నుంచి రోడ్డుపైకి గెంటారని అనంతపురం జిల్లా రాప్తాడు మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన చాకలి రామాంజనేయులు దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. దయచేసి తాము తమ ఇంట్లో ఉండేలా సాయం చేయాలని వృద్ధ దంపతులు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

– తమఇంటి పక్కనున్నవారు భూమిని ఆక్రమించి ఇబ్బంది పెడుతున్నారని పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలానికి చెందిన విజయలక్ష్మి ఫిర్యాదు చేసింది. అధికారులు సర్వే చేసి తమ భూమి కబ్జా నుంచి విడిపించాలని వినతిపత్రం అందజేసింది.

– తమ స్వాధీనంలో ఉన్నభూమిని గత ప్రభుత్వంలో ఎటువంటి హక్కులు లేనివారికి మ్యూటేషన్ చేసి ఆన్‌లైన్ చేశారని కర్నూలుజిల్లా హలహర్వి మండలం విరుపాపురం గ్రామానికి చెందిన విశ్వనాథ్ ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు విచారించి తమ భూమి తమపేరుపైన ఉండేలా చూడాలని విన్నవించారు.

– తన ఇంటిపై నుంచి వెళుతున్న సర్వీస్ విద్యుత్ వైర్లను తొలగించి పక్కకు మార్చాలని పల్నాడు జిల్లా అమరావతి మండలం మండేపూడి గ్రామానికి చెందిన కోట నాగభూషణం వినతిపత్రం అందజేశారు. లేదంటే తమకు ఆ వైర్ల నుంచి ప్రమాదం ఉందని విన్నవించారు.





# పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలి

- వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థల నిర్వీర్యం
- ప్రజలను మభ్యపెట్టడం ఇకనైనా మానుకోవాలి
- ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ




గుంటూరు(చైతన్యరథం): గుంటూరు తూర్పు నియోజకవర్గ అర్బన్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఉపాధ్యాయులతో శనివారం గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టూరిజం డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు. చంద్రబాబు సమర్థవంతమైన పాలనకు మరింత మద్దతు ఇవ్వడానికి పట్టభద్రులు టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువత సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని కూటమి నేతలు, కార్య కర్తలకు సూచించారు. పట్టభద్రుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న ఆలపాటిని గెలిపించుకుందామన్నారు.

వైసీపీ గత ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేసినందుకే ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టే మాటలు మాట్లాడటం ఇకనుంచైనా మానుకోవాలని హితవు పలికారు. నేతలు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుని ఓటర్లను చైతన్యపరచాలని సూచించారు. వ్యవస్థలను చక్కదిద్ది సీఎం చంద్రబాబు పాలనలో స్పష్టమైన మార్పు తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి తో పాటు విద్యారంగం బలోపేతానికి ఆయన కృషి ప్రశంసనీయమన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉపాధి కల్పనే లక్ష్యంగా అనేక సంస్థలు ఏర్పాటు చేస్తున్నారని, రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు సీఎం చంద్ర బాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఇప్పటికే 4 లక్షల మంది నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు ప్రభుత్వ పరంగా చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. పలు సంస్థలతో ఒప్పందాలు పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం రాష్ట్రంలో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నక్క ఆనంద్‌బాబు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదే వెంకటేశ్వర్లు, గుంటూరు తూర్పు నియోజకవర్గం అబ్జర్వర్ రాఘవేంద్ర, బీజేపీ నాయకులు ఉమాశంకర్, డిప్యూటీ మేయర్ సాజిల, కార్పొరేటర్ సరిత, చిట్టిబాబు, యల్లావుల అశోక్, రైల్వే బోర్డు నెంబర్ అంగిరేకుల వర ప్రసాద్ యాదవ్, ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్స్, గుంటూరు పట్టణ నాయకులు, ప్రైవేట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# ఇది రైతు ప్రభుత్వం.. ఏ సమస్యా రానివ్వం

- మార్కెట్‌ను బట్టి గిట్టుబాటు ధరకు చర్యలు
- మిల్లర్లకు గత బకాయిలు రూ.361 కోట్లు
- వారు నిర్లక్ష్యం వహిస్తే కేసులు నమోదు
- తేమ శాతం నిర్ధారణకు ఒకే కంపెనీ మిషన్లు
- నెల్లూరు జిల్లాలో గత ప్రభుత్వ రవాణా, హమాలీ చార్జీలను రెండురోజుల్లో చెల్లిస్తాం
- కౌలు చట్టంలో మార్పులతో రైతులకు మేలు
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్
- సంగంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
- పాల్గొన్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి



నెల్లూరు/సంగం(చైతన్యరథం): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శని వారం ఉదయం నెల్లూరు జిల్లా సంగం మండలంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి పలు ప్రారంభోత్సవ కార్యక్రమా ల్లో ఆయన పాల్గొన్నారు. సంగం మండల కేంద్రంలో రూ.20.50 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం, గోదాములు, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పారు. రైతులకు మార్కెట్‌ను బట్టి మద్దతు ధర అందించేలా కృషి చేస్తామని వివ రించారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తేమ శాతాన్ని నిర్ధారించేందుకు ఒకే కంపెనీ మిషన్లు అందుబాటులో తీసుకొస్తామన్నారు. ప్రతి మండలానికి కూడా ఒక డ్రయర్ అందించేందుకు, ఉపాధి హామీ నిధులతో ప్రభుత్వ భూముల్లో సిమెంట్ కల్లాలు ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. 50 శాతం సబ్సిడీతో టార్పాలిన్ పట్టలను రైతులు అందిస్తామని చెప్పారు. కౌలు రైతులకు మేలు జరిగేలా కౌలు రైతు చట్టంలో మార్పులు చేస్తూ రైతు భరోసా వచ్చేలా నూతన చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఇబ్బందులు లేకుండా 30లక్షల గోతాలను అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో 33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగులు చేసి 5.87 లక్షల మంది రైతు లకు 24 గంటల్లో రూ.7480 కోట్లు జమచేసినట్లు చెప్పారు.

## గత ప్రభుత్వ బకాయిలు చెల్లించాం

గత ప్రభుత్వంలో నెల్లూరు జిల్లాలో రూ.32 కోట్ల రైతుల సొమ్ముని స్కామ్ చేసి దోచేశారన్నారు. గత ప్రభుత్వ పాలకులు వ్యవస్థలను దుర్వినియోగం చేసి రైతులను మోసం చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం మిల్లర్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ.361 కోట్లను కూడా తమ ప్రభుత్వం చెల్లించిందన్నారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి మిల్లర్లకు రూ.10 కోట్లు చెల్లిం చామన్నారు. అలాగే రైతులకు సంబంధించి గత ప్రభు త్వం ధాన్యం సేకరించి డబ్బులు చెల్లించకుండా రూ.1674 కోట్లు బకాయి పెట్టగా వాటిని కూడా చెల్లించడం జరిగిందని వివరించారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి గత ప్రభుత్వం బకాయి పెట్టిన రవాణా, హమాలీ చార్జీలు రూ.1.40 కోట్లు రెండురోజుల్లో రైతుల ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గత ఏడాది కంటే ఈ ఏడాది నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా కొనుగోలు చేసి 24 గంటల్లోపే డబ్బులు చెల్లించామని చెప్పారు. రైసుమిల్లుల యజమానులు బాధ్యతగా పనిచేయాలని..రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు.

## వచ్చే నెల నుంచి మరో 300 కేంద్రాలు

నెల్లూరు జిల్లాలో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మార్చి ఒకటో తేదీ నుంచి జిల్లాలో సుమారు 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా 32లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తుండగా, 25లక్షల ధాన్యాన్ని పీడీఎస్ బియ్యానికి వినియోగిస్తున్నట్లు చెప్పారు. తేమ శాతం 17 కంటే ఎక్కువగా ఉంటే ఒక కిలో నుంచి ఐదు కిలోల వరకు మాత్రమే ధాన్యం తీసుకోవాలని, అంతకు మించితే కేసులు నమోదు చేసి చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో మూడు వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకోగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఒక్కొక్కరికి లక్ష చొప్పున 1871 మందికి ఆర్థిక సహాయం అందించారని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకానికి వచ్చే విద్యాసంవత్సరం నుంచి సన్నబియ్యాన్ని సరఫరా చేయబోతున్నట్లు చెప్పారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఆత్మకూరు అభివృద్ధికి రామనారాయణరెడ్డి పట్టుదలతో పనిచేస్తున్నారని, వందల కోట్ల నిధులను వెచ్చిస్తున్నారని చెప్పారు.

## తమ పూర్తి చేస్తే వారి పేర్లు పెట్టుకున్నారు: ఆనం

దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరుతో మంత్రి నాదెండ్ల మనోహర్‌కు మంచి అనుబంధం ఉందని నాటి విషయాలు గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల పడిన బాధలు వర్ణణాతీతమని చెప్పారు. ధాన్యం అమ్ము కోవాలంటే రైసుమిల్లుల వద్ద నాలుగైదు రోజులు తిండితిప్పలు లేకుండా అవస్థలు పడ్డా రని వివరించారు. ఆ ప్రభుత్వంలో పడిన కష్టాలు పడకుండా రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. తమ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిన సంగం, నెల్లూరు ఇరిగేషన్ ప్రాజెక్టులకు గత ప్రభుత్వం తమ పేర్లు పెట్టుకుని ప్రారం భోత్సవాలు చేసుకుందన్నారు. అయినా పూర్తిస్థాయిలో పనులు చేయలేదన్నారు. సంగం రోడ్డు కం బ్యారేజ్‌ని నిర్మించేందుకు తాను ఆర్థికమంత్రిగా 130 కోట్లు మంజూరు చేస్తే కేవలం సంగం బ్యారేజ్‌ను మాత్రమే పూర్తి చేసి రోడ్డును నిర్మించలేదన్నారు. ఈ రోడ్డును పూర్తి చేసి జాతీయ రహదారికి అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. సీఎంతో కూడా ఈ విషయమై చర్చించినట్లు చెప్పారు. మెట్టప్రాంతాన్ని డెల్టాగా మార్చి పుష్కలంగా పంట లు పండేలా సమృద్ధిగా నేడు సాగునీరు రైతులకు అందేలా చేశామన్నారు. సంగంలోని ప్రాథమిక సహకార సంఘాన్ని గతంలో రాజకీయ కేంద్రంగా వినియోగించుకుంటే తాము రైతులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దినట్లు చెప్పారు. బ్యారేజ్ వద్ద బ్రిడ్జిని పూర్తిచే యాలని, ఆత్మకూరు ఐటీఐ కళాశాలను సంగంలో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు.

## రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం: వేమిరెడ్డి

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో వరిపంట వేశారని, 11 మిలి యన్ టన్నుల ధాన్యం పండే అవకాశం ఉందన్నారు. ఈ ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు జిల్లాలో వ్యవసాయ గోడౌన్‌లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 78 సహకార సంఘాలు ఉన్నాయని, వీటి పరిధిలో దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం విక్రయించుకునేందుకు జిల్లాలో 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతుకు మంచి గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేముల పాటి అజయ్‌కుమార్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవో పావని, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డీసీవో గుర్రప్ప, ఎన్‌డీసీసీ బ్యాంకు సీఈవో శ్రీనివాసరావు, సంగం పీఏసీఎస్ చైర్మన్ కట్టా సుబ్రహ్మణ్యం, సీఈవో దస్తగిరి అహ్మద్, తహశీల్దార్ సోమ్లానాయక్, సర్పంచ్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు ప్రభుత్వం ఎంతైనా భరిస్తుంది

- కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలి
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- రేపల్లె గురుకుల బాలికల పాఠశాల తనిఖీ

రేపల్లె(చైతన్యరథం): పేద విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చునైనా భరిస్తుందని, విద్యార్థులు కష్టపడి చదివి తమ తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు.



శనివారం బాపట్ల జిల్లా రేపల్లెలో అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, మరుగుదొడ్లు, పరిసరాలు పరిశీలించారు.

పాఠశాల ఆవరణలో అపరిశుభ్రతపై ప్రిన్సిపల్‌పై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో నేలపై కూర్చుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు గమనించాలని, కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని విద్యార్థులకు మంత్రి పిలుపునిచ్చారు.





# ఆలపాటికి మద్దతుగా ప్రచారం


విజయవాడ (చైతన్యరథం): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మద్దతుగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు శనివారం ఉదయం 58వ డివిజన్లో 101వ బూత్‌లలో ఎమ్మెల్సీ ఓట్ల వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వివేకానంద సెంటినరీ హై స్కూల్ హెడ్మాస్టర్ నాగేంద్ర బాబుని కలిసి ఈనెల 27వన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కడప రీజియన్ ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ పోలా నాగరాజు, విజయవాడ సెంట్రల్ టీడీపీ అబ్జర్వర్ దేవతోటి నాగరాజు, షేక్ గౌసియా సుల్తానా, సయ్యద్ గౌసియా, తదితరులు పాల్గొన్నారు.

# నేడు యథాతథంగా గ్రూప్-2 మెయిన్స్

## పరీక్ష వాయిదాకు ఏపీపీఎస్సీ తిరస్కృతి ◆ అభ్యర్థుల ఆందోళనలు పట్టించుకోని వైనం

అమరావతి (చైతన్యరథం): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) స్పష్టత ఇచ్చింది. గ్రూప్ 2 పరీక్షల్ని వాయిదా వేయాలంటూ అభ్యర్థుల నుంచి వస్తున్న డిమాండ్‌లను ఏపీపీఎస్సీ పట్టించుకోలేదు. ప్రభుత్వం నుంచి వచ్చిన అధికారిక లేఖను కూడా పట్టించుకోలేదు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున.. గ్రాడ్యుయేట్లకు మేలు చేసేలా చేసిన సూచనను తాము పాటించలేమని స్పష్టం చేసింది. గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయడం సాధ్యం కాదని ఏపీపీఎస్సీ స్పష్టం చేసింది. ముందు ప్రకటించిన మేరకే ఆదివారం.. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరుగుతాయని తెలిపింది. షెడ్యూల్ ప్రకారం.. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుందని ఏపీపీఎస్సీ అధికారులు ధ్రువీకరించారు. అభ్యర్థులు 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 92,250 మంది మెయిన్స్ పరీక్షకు హాజరు కానున్నారు.

రోస్టర్ తప్పులుసరిచేయకుండా పరీక్ష నిర్వహణపై రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు ఆందోళనకు దిగారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలపై అభ్యర్థుల విన్నపాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిగణనలోకి తీసుకుంది.



23న నిర్వహించాల్సిన పరీక్షను కొద్ది రోజులు వాయిదా వేయాలని కోరుతూ ఏపీపీఎస్సీ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. రోస్టర్ అంశం కోర్టులో ఉంది.. వచ్చే నెల 11న హైకోర్టులో మరో మారు విచారణ జరగనుంది.. కోర్టులో ఉన్న ఈ అంశంపై అఫిడవిట్ వేసేందుకు ఇంకా సమయం ఉందని, అప్పటి వరకు పరీక్షలు నిర్వహించవద్దని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కానీ, ఏపీపీఎస్సీ మాత్రం ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే పరీక్ష నిర్వహిస్తామని స్పష్టత ఇచ్చింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ సూచించింది. గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షా కేంద్రాలు, సమయాలు, ఇతర వివరాలను అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లలో చూసుకోవాలని కమిషన్ తెలిపింది.

### అభ్యర్థులకు సూచన..

గ్రూప్ 2 పరీక్షలు ఏపీ వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లలో ఉన్న సమాచారం ఆధారంగా తమ పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సమయానికి చేరుకోవాలని, అవసరమైన పత్రాలను కూడా తీసుకురావాలని కమిషన్ ఈ సందర్భంగా సూచించింది. ఏపీపీఎస్సీ అభ్యర్థుల పరీక్షకు సంబంధించిన సమాచారాన్ని తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలైనా ఉంటే, వారు కమిషన్ అధికారిక నంబర్ లేదా ఇ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపింది. ఈ నేపథ్యంలో గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షల కోసం అభ్యర్థులు తమ సన్నాహాలను పూర్తి చేసుకోవాలని కమిషన్ సూచనలు జారీ చేసింది. పరీక్షకు హాజరయ్యే సమయంలో నిబంధనలను పాటించాలని సూచించింది. మరోవైపు ఏపీపీఎస్సీ ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది.

### అభ్యర్థుల ఆందోళన..

కాగా, గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని,రోస్టర్ విధానంలో మార్పులు చేయాలంటూ అభ్యర్థులు కొద్దిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ విషయంపై అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లగా.. పరీక్షలను నిలిపివేయడాన్ని నిరాకరిస్తూ సింగిల్ జడ్జి ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రూప్-2 అభ్యర్థులు పెద్దఎత్తున నిరసనలకు దిగారు. వివిధ ప్రాంతాల్లో రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. 2023 డిసెంబరు 7వ తేదీన ఏపీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్ సుప్రీంకోర్టు తీర్పు,ఏపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో 77కి విరుద్ధంగా ఉందని, ఈ విషయాన్ని సింగిల్ జడ్జి విస్మరించారని తెలిపారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించి, 23న జరగనున్న గ్రూపు-2 మెయిన్స్ పరీక్షను నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు.

# అమరావతిలో మళ్లీ వెలుగులు

- వచ్చే 15 నుంచి రాజధాని నిర్మాణపనులు ప్రారంభం
- ప్రాధాన్య ప్రాజెక్ట్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక టెండర్లు ఖరారు
- తరువాత ఊపందుకోనున్న పనులు



అమరావతి (చైతన్యరథం): జగన్‌రెడ్డి విధ్వంస పాలన కారణంగా ఐదేళ్లపాటు నిలిచిపోయిన రాజధాని అమరావతి పనులు మార్చి 15 నుంచి తిరిగి ప్రారంభంకానున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణంగా నిర్మించాల్సిన అమరావతిని జగన్ రెడ్డి పాడుబెట్టేశారు. ఒకవేళ తాను అధికారం కోల్పోయి, మరొకరు అధికారంలోకి వచ్చినా ఎట్టి పరిస్థితుల్లోనూ అమరావతి నిర్మించటానికి వీలు లేకుండా చేయాల్సిన విధ్వంసమంతా చేశారు. అయితే అమరావతికి పునాది వేసిన చంద్రబాబు నాయుడు మళ్ళీ ముఖ్యమంత్రి కాగానే మొదట అమరావతిపైనే దృష్టి సారించారు. రాష్ట్ర విభజన కారణంగా 2014లోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేతిలో చిల్లి గవ్వ లేదు. జగన్ చేసిన అప్పుల కారణంగా ఇప్పుడూ ప్రభుత్వం చేతిలో చిల్లిగవ్వ లేదు. అంటే అప్పుడూ, ఇప్పుడూ ఒకే పరిస్థితి నెలకొని ఉంది. కానీ సీఎం చంద్రబాబు.. మొక్కవోని పట్టుదలతో ప్రపంచ బ్యాంక్ నుంచి రూ.15000 కోట్లు, హడ్కో నుంచి మరో రూ.11,000 కోట్లు దీర్ఘకాలిక రుణాలు సాధించి అమరావతి పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. చేతిలో నిధులు, రాజధాని నిర్మించుకోవాలనే బలమైన సంకల్పం, కేంద్రం సహాయ, సహకారాలు ఉన్నందున ఒకసారి పనులు ప్రారంభమయితే పరుగులు తీయటం ఖాయమే.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఎన్నికల కమి షన్ ఆదేశాలతో టెండర్ల ఖరారు ఆలస్యం అయ్యింది. టెండర్లు పిలుచుకోవచ్చు కానీ ఖరారు చేయవద్దని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు దాదాపు 62 పనులకు సీఆర్డీఏ, ఏడీసీ టెండర్లను పిలిచాయి. సుమారు 40వేల కోట్ల విలు వైన పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది.మరో 11పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎత్తేయగానే టెండర్లు ఖరారు చేస్తారు. మార్చి 15 నుంచి నిర్మాణ సంస్థలు తమ యంత్రాలు, కార్మికులు, ఇంజనీర్లను అమరావతిలో దించబోతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంకల్లా అమ రావతిలో వివిధ సంస్థలకు చెందిన 30,000 మంది ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు, కార్మికులు పనులు చేస్తుం టారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి నారాయణ తెలిపారు. 2027 డిసెంబర్‌లోగా అమరావతిలో వీలైనన్ని నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని, వాటితో రాజధానికి రూపురేఖలు వస్తాయని మంత్రి నారాయణ చెప్పారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతి నిర్మాణాన్ని ప్రాధాన్య ప్రాజెక్టుగా తీసుకుంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ స్వయంగా అమరావతి ప్రాంతంలో పర్యటించి అక్కడ నిలిచిపోయిన పనులను పరిశీలించారు. తరువాత చెన్నై ఐఐటీ, హైదరాబాద్ ఐఐటీలకు చెందిన నిపుణుల బృందం అమరావతిలో నిలిచిపోయిన నిర్మాణాలను పరిశీలించి, సెక్రటేరియెట్, అసెంబ్లీ వంటి ఐకానిక్ భవనాల పటిష్టతపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. ఇక్కడ నిర్మాణాలకు ఎలాంటి డోకా లేదంటూ ఐఐటీ బృందం నివేదిక ఇచ్చింది. అలాగే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్, ఐఏఎస్, ఐపీఎస్ భవనాలు పటిష్టంగా ఉన్నాయని నివేదిక ఇచ్చారు. అలాగే అమరావతిలో పేరుకుపోయిన జంగిల్ క్లియరెన్స్‌ను పూర్తిస్థాయిలో చేపట్టారు. దీంతో నిర్మాణాలకు ఎలాంటి ఆటంకం లేకుండా శరవేగంగా పనులు ముందుకు సాగుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఇప్పుడు రాష్ట్రంలో సుస్థిరమైన ప్రభుత్వం ఉంది. కేంద్రంలో సీఎం చంద్రబాబు నాయుడు కీలకంగా ఉన్నారు. ఏపీకి కేంద్రం సహాయ సహకారాలు అందిస్తోంది. ముఖ్యంగా అమరావతిని వ్యతిరేకస్తున్న జగన్, కేసీఆర్ ఇద్దరూ రాజకీయంగా చాలా బలహీనంగా ఉన్నారు. కనుక అమరావతి నిర్మాణ పనులకు ఇక ఎటువంటి ఆటంకమూ లేనట్లే!

## గాయపడిన గురుకుల విద్యార్థికి రూ.2 లక్షలు



- సీఎంఆర్‌ఎఫ్ మంజూరు చేయించిన మంత్రి డోలా
- హామీ ఇచ్చిన మరుసటిరోజే వైద్యం కోసం ఎల్‌వోసీ
- చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

ఒంగోలు(చైతన్యరథం): గాయపడిన గురుకుల విద్యార్థికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి రూ.2లక్షలు సీఎం ఆర్‌ఎఫ్ నిధులు మంజూరు చేయించారు. రెండురోజుల క్రితం వేడి పాలు మీదపడి టంగుటూరు జ్యోతి బాపూలే గురుకుల విద్యాలయ 5వ తరగతి విద్యార్థి మధుమోహన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో విద్యార్థిని పరామర్శించిన మంత్రి డోలా సీఎంఆర్‌ఎఫ్ నిధులతో వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మరుసటి రోజే ముఖ్యమంత్రి కార్యాలయంతో మాట్లాడి రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈ ఎల్‌ఓసీని విద్యార్థి తల్లిదండ్రులు శనివారం ఆసుపత్రి యాజమాన్యానికి అందజేశారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వైద్యం చేయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థికి కూటమి నాయకుల మద్దతు



విజయనగరం (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాలని, తొలి ప్రాధాన్యత ఓటును వేయాలని మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు కోరారు. శనివారం విజయనగరం జిల్లా కేంద్రంలోని అశోక్ బంగ్లాలో రఘువర్మకు మద్దతుగా పార్టీ నాయకులుతో సమీక్ష నిర్వహించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు రఘువర్మ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రాధాన్యతీస్తుందని వివరించారు. పర్యాటకశాఖ డైరెక్టర్ ఇందుకూరి సుబ్బలక్ష్మి, తెదేపా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటీలో 30 వేల కిలోల గంజాయి దహనం



అల్లూరి సీతారామరాజు (చైతన్యరథం): ఫార్మాసిటీలోని కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు(సీడబ్ల్యుఎంపీ)లో గల ఇన్సినరేషన్ ప్లాంటులో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి నేతృత్వంలో 30 వేల కిలోల గంజాయి, 35 కేజీల హ్యాష్ ఆయిల్‌ను దహనం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు గత మూడేళ్లలో వేర్వేరు ప్రాంతాల్లో సుమారు 30 వేల కిలోల గంజాయి, 35 కేజీల హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని శాస్త్రీయ పద్ధతిలో దహనం చేయాలన్న న్యాయస్థానం ఆదేశాల మేరకు ఫార్మాసిటీలోని సీడబ్ల్యుఎంపీలో ఈ ప్రక్రియ చేపట్టారు. గంజాయి మొత్తం రెండు, మూడు రోజుల్లో దహనం అవుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల ఎస్పీలు అమిత్‌బర్దర్, తుహిన్‌సిన్హా, పాడేరు అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్, చింతపల్లి ఏఎస్పీ నవజ్యోత్‌సింగ్ మిశ్రా, పాడేరు, పరవాడ డీఎస్పీలు షాబాజ్ అహమ్మద్, విష్ణుస్వరూప్, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: చింతమనేని ప్రభాకర్



దెందులూరు (చైతన్యరథం): ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ సమస్యలపై పలువురు వినతులు అందించారు. వారి సమస్యలను విన్న ప్రభాకర్ సమస్యల పరిష్కారానికి అనువుగా చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో వచ్చిన ప్రతి ఒక్కరి నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తారనన్నారు. కొన్ని సమస్యల పరిష్కారంలో కొంచెం ఆలస్యమైనా సమస్య పరిష్కారమే అంతిమమని ఆయన పేర్కొన్నారు.

## రైతులకు భూధార్ తప్పనిసరి... వెంటనే నమోదు చేసుకోండి!





ఆధార్ కార్డు మాదిరిగానే సొంత భూమి కలిగిన రైతులకు ప్రభుత్వం భూధార్ సంఖ్యను కేటాయిస్తోంది. భూమి హక్కులను ధ్రువీకరించే ఆధీకృత రికార్డులు కలిగిన రైతులకు మాత్రమే విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలతోపాటు బ్యాంక్ రుణాలు వంటి సౌకర్యాలకూ భూధార్ తప్పనిసరని కేంద్రం స్పష్టం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో రైతు సేవా కేంద్రాల్లో నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. అదే సమయంలో కౌలు రైతులు, అసైన్డ్ రైతుల పరిస్థితి ఏంటని రైతు సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా సొంత భూమి కలిగిన రైతులను నమోదు చేయాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఈ నెల 10న అన్ని జిల్లాలకు ఉత్తర్వులు జారీ చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ఈ నమోదు ప్రక్రియను ప్రత్యేకంగా రూపొందించిన ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో చేపడుతున్నారు. రైతు సేవాకేంద్రం సహాయకుడి వద్దకు రైతులు తమ ఆధార్ కార్డును, పట్టాదారు పాసు పుస్తకాన్ని లేదా 1బి, అడంగల్‌ను, ఆధార్ లింక్ అయిన మొబైల్ ఫోన్ తీసుకెళ్లాలి. మీభూమి పోర్టల్, రికార్డ్స్ ఆఫ్ రైట్స్, పట్టాదార్ పాస్ పుస్తకాల ఆధారంగా రైతుల యాజమాన్య హక్కుల్ని నిర్ధారించి 11 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. ఈ ప్రక్రియను వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వం కేటాయించే భూధార్ ఆధారంగానే ప్రభుత్వ పథకాలైన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన, బీమా, బ్యాంకు రుణాలు మంజూరు చేయనున్నారు. దీంతో రైతులంతా జోరుగా నమోదు చేసుకుంటున్నారు. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలో 40వేల మంది రైతుల వరకు నమోదు చేసుకున్నారు. దూరప్రాంతాల్లో ఉన్నవారూ పేర్లు నమోదు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కౌలుదారులతోపాటు దేవదాయ భూములు, అసైన్డ్, అటవీ భూములు సాగు చేసుకునే చాలామంది రైతులకు నేరుగా యాజమాన్య హక్కులు లేవని, వీరి సమస్యను ప్రభుత్వం ఎలా పరిష్కరిస్తుందని రైతు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. అయితే రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇచ్చే ప్రక్రియను ఈ నెల 25లోగా పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

## రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



విజయనగరం (చైతన్యరథం): మిర్చి, టమోటా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు వ్యాఖ్యానించారు. శనివారం విజయనగరంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... ఇటీవల మిర్చి రైతులపై వైసీపీ నేత జగన్మోహన్‌రెడ్డి లేని ప్రేమను ఒలకబోస్తూ గుంటూరు మిర్చి యార్డులో చేసిన నటనను చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. పేయిడ్ అర్టిస్ట్‌లను తీసుకొచ్చి హంగామా సృష్టించారని, రైతుల పరామర్శ పేరుతో వైసీపీ నేతలు మిర్చి బస్తాలు దొంగిలించాలరని... ఇంతకంటే చిల్లర చేష్టలు ఎక్కడ లేవన్నారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్న తిన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధికారం కోల్పోయినా కూడా ఇంకా అదే తీరులో దోపిడిని కొనసాగించడం దారుణమన్నారు. కూటమి పాలనలో రైతులు చాలా సంతోషంగా ఉన్నారని రాబోయే రోజుల్లో ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం చేయబోతున్నామని, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నిధులు రైతులకు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏనాడు ధాన్యం కోనుగోళ్లకు డబ్బులు చెల్లించలేదన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మిర్చి పంటలో నల్లి తెగులు సోకి లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే ఆనాడు జగన్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. నాడు టీడీపీ హయాంలో మిర్చి ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి మిర్చిని కొనుగోలు చేసిందన్నారు. రైతుల పట్ల చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, వైసీపీ దుష్ప్రచారాన్ని నమ్మొద్దని టీడీపీ నేతలు కోరారు. పోలవరం పనులు ప్రారంభమైయ్యాయని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రఘువర్మను మంచి మెజార్టీతో గెలిపించాలి : గిడ్డి ఈశ్వరి




పాడేరు (చైతన్యరథం): ఈనెల 27వ తేదిన జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. శనివారం పాడేరు నియోజకవర్గం పరిశీలకుడు రాజమండ్రి నారాయణతో కలిసి ఆమె ఇంటింటికి వెళ్లి కపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, ఈ ఎన్నికల్లో రఘువర్మను మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోట రత్నం, సబ్బిడి ఉమా, బొర్రా నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొర్రా విజయ రాణి, తెలుగు యువత నియెజకవర్గ అధ్యకులు డప్పొడి బుజ్జీ, పాడేరు సూపర్, బుక్క జగదీష్, మాజీ సర్పంచ్ రేగం కొండబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : విజయ్‌చంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే విజయ్‌చంద్ర ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజా సమస్యలను పరిష్కరించే వేదికగా టీడీపీ కార్యాలయం నిలుస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, పార్వతీపురం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని అన్నారు. తాము నిర్వహిస్తున్న ఈ గ్రీవెన్స్‌కు ప్రజల నుంచి పెద్దఎత్తున విశేష స్పందన లభించిందన్నారు.

## విశాఖలో గ్రూప్ - 2 అభ్యర్థుల ధర్నా...



విశాఖపట్నం (చైతన్యరథం): పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ గ్రూప్–2 అభ్యర్థులు విశాఖలో ఆందోళనకు దిగారు. దాదాపు రెండు గంటలుగా ఇసుకతోట కూడలి వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. విశాఖ వ్యాలీ జంక్షన్ వరకు వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ట్రాఫిక్ మళ్లింపునకు పోలీసులు చర్యలు చేపట్టారు.

## విజ్ఞానవంతుడు పేరాబత్తులకు పట్టం కడదాం

**●చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ పిలుపు**



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజ్ఞతతో ఆలోచించి విజ్ఞానవంతుడైన పేరాబత్తుల రాజశేఖరానికి పట్టం కట్టాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శు క్రవారం ఆయన జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఆలపాటి గంగాభవాని ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్సీ ఎన్నికలపై ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఏలూరు జిల్లా టీడీపీ ఇన్‌ఛార్జ్ గన్ని వీరాంజనేయులు, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ్ చంద్ర శేషు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, జగ్గవరపు ముత్తారెడ్డి, కరాటం రాంబాబు, జనసేన ఇన్‌ఛార్జ్ మేక, బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఈశ్వరయ్య తదితరులతో కలిసి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా ఎన్నికల అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి కూటమి అభ్యర్థిగా పోటీలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖరం మంచి ఆలోచనపరులని, నిరుద్యోగుల సమస్యల పట్ల గళం వినిపిస్తారని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల విజయమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. పేరాబత్తుల రాజశేఖరానికి ఒక్క అవకాశం ఇస్తే పట్టభద్రుల ప్రయోజనాలను కాపాడుతారన్నారు. నిరుద్యోగుల సమస్యలనూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఏడేళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లింపులు, వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఏ విధంగా అయితే కృషి చేశారో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రెట్టింపు స్థాయిలో కృషి చేసి రాజశేఖరానికి విజయం చేకూర్చాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉంటుందని, ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లో పార్టీ సింబల్ ఉండదని.. క్రమ సంఖ్యలో నెంబర్లు ఉండి పేర్లు మాత్రమే ఉంటాయని... కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పేరు ఎదురుగా ఉన్న గడిలో 1వ నెంబర్ వేసి ఆయనకు అఖండ విజయం చేకూర్చాలని గ్రాడ్యుయేట్ ఓటర్లను కోరారు. ఈ ఎన్నికల సమావేశంలో పట్టణ టీడీపీ సీనియర్ నాయకులతోపాటు మండల టీడీపీ నాయకులు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చంద్రబాబు పాలనలోనే సంక్షేమాభివృద్ధి

### కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం గెలుపు చారిత్రాత్మక అవసరం... మంత్రి రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): రాష్ట్ర భవిష్యత్తుతో పాటు భావితరాలు, భవిష్యత్ తరాల కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోడీల మేలు కలయికను సమర్ధించేందుకు ఎమ్మెల్సీ గెలుపు చారిత్రాత్మక అవసరమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపును కోరుతూ స్థానిక ఆదిత్య విద్యాసంస్థల కళాశాలలో గ్రాడ్యుయేట్లను కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్. వి.రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టిడిపి పాలకొల్లు నియోజకవర్గ పరిశీలకుడు పెచ్చెట్టి చంద్రమౌళి, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బోనం చినబాబు, జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాజశేఖర్ గెలుపుకు మొదట ప్రాధాన్యత ఓటు వెయ్యాలని కోరారు. గత జగన్ ఐదేళ్ల రాక్షస, నియంతృత్వ, కక్షలు, వేధింపులు వంటి పాలన నుంచి విముక్తి పొంది నేడు చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రం పరుగులు పెడుతుందన్నారు. ప్రధానంగా అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు పునర్నిర్మాణాలతో పాటు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల, రైల్వే జోన్ వంటివి కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముందుకు వెళుతున్నాయి అన్నారు. మరోపక్క వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెంచిన పెన్షన్ సొమ్ముతోపాటు అన్న క్యాంటీన్ లో పునరుద్ధరణ, మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఉచితం, ప్రతినెల ఒకటో తేదీన జీతాలు వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలకు డీఎస్సీపై తొలి సంతకం చేశారని మంత్రి రామానాయుడు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిగానే డీఎస్సీ నిర్వహించి వచ్చే విద్యా సంవత్సరానికి ముందుగానే ఉపాధ్యాయ నియమకాలు చేపడతామని లోకేష్ తెలిపినట్లు చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరానికి ముందుగానే తల్లికి వందనం అమలు చెయ్యబోతున్నామన్నారు.

## కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు... ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి రాజధాని అమరావతి, ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు వంటి అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌తో కలిసి శనివారం ఏలూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏలూరు సీ.ఆర్.రెడ్డి విద్యాసంస్థలకు వెళ్లి ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించి ఓట్ల అభ్యర్థించారు. అనంతరం ఏలూరులోని అతిథి హొటల్ లో ఏ.పీ.పీ.యూ.ఎస్.ఎం.ఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యావంతుల సమావేశంలో ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలు ఆచంట సునీతతో కలసి ఎంపీ మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా 8 నెలల కాలంలో రాష్ట్రానికి నాలుగు లక్షల ఉద్యోగాలు వచ్చాయని తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని ఎంపీ వెల్లడించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీ మహేష్ కుమార్ కోరారు. అనంతరం నమూనా బ్యాలెట్ పత్రాలను పంపిణీ చేసి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్, పరిశీలకురాలు ఆచంట సునీత, తదితరులు మాట్లాడారు.

## పేరాబత్తులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి సహకరించండి : బొడ్డు



రాజానగరం (చైతన్యరథం): ఈ నెల 27వ తేదిన జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం శనివారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రాజనగరం మండలం మరియు కోరుకొండ మండలాలోని గ్రామ నాయకులు, కార్యకర్తలు ప్రచారం ఏ విధంగా చేయాలో శిక్షణ అందించడంతో పాటు గ్రాడ్యుయేట్ ఓటర్ వేరిఫికేషన్‌కి సంబంధించి గ్రాడ్యుయేట్ ఓటర్ల యొక్క వివరాలను టీడీపీ టెలిగ్రామ్ బాట్ యాప్‌పై ఏ విధంగా అప్డేట్ చేయాలో అవగాహన ఏర్పరిచే కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజనగరం కోరుకొండ మండలాల్లోని నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## పేరబాత్తులను గెలిపించండి

కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలో ఎలిమెంటరీ స్కూల్ మరియు సచివాలయం స్టాఫ్‌ని కలిసి ఫిబ్రవరి 27వ తేదీన జరగనున్న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గ్రాడ్యుయేట్లు అంతా కూడా కూటమి అభ్యర్థి అయిన పేరాభత్తుల రాజశేఖరంకి తొలి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, కూటమి అభ్యర్థి గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామంలో సెయింట్ జోసఫ్ విద్యాసంస్థల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు. కూటమి బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట (చైతన్యరథం): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గ ఎమ్మెల్యే సత్యానందరావు శనివారం రావులపాలెంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులంతా కూటమి బలపరిచిన వ్యక్తికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రత్యర్థి ఎవరైనా ఓటు మాత్రం కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు ఓటేయాలని కోరారు. ఈ మేరకు పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సత్యానందరావు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీశ్ మాధుర్, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ గణేష్ కుమార్, బీజేపీ నాయకులు పునిగెల రఘురామ్, వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మెగా డీఎస్సీ : బూరుగుపల్లి

నిడదవోలు (చైతన్యరథం): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన వ్యక్తిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషారావు గెలిపించాలని కోరారు. ఈ మేరకు శనివారం నియోజకవర్గంలోని పేరవాలి మండలం, ముక్కాముల గ్రామంలో ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ నెల 27వ తేదిన జరగబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, జగన్ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి వైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకువెళ్తున్నారని అన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని తెలిపారు. నిరుద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించండి : నక్కా ఆనందబాబు



గుంటూరు (చైతన్యరథం): ఈనెల 27వ తేదీన జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీమంత్రి, వేమూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం లాడ్జి సెంటర్‌లోని ఆంధ్ర లూథరన్ బీఈడీ కాలేజీలో విద్యార్థులు, ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి ఓటేసి గెలిపించాలని కోరారు. ఎన్డీయే కూటమితోనే రాష్ట్రాభివృద్ధిఋ సాధ్యమని, ఐదేళ్ల వైసీపీ పాలనలో నిరుద్యోగులను జగన్ నిండా ముంచేశారని అన్నారు. ఎమ్మెల్సీ కోడ్ ముగిసిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్డీయే పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు

**●భవానీపురంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన టీడీపీ నేతలు**



విజయవాడ (చైతన్యరథం): ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, కూటమి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అందిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఎన్టీఆర్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య వ్యాఖ్యానించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. శనివారం భవానిపురం పరిధిలోని 42, 43 డివిజన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం గ్రాడ్యుయేట్ ఓటర్ల ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీనియర్ నాయకులు విద్యావంతులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు శాసనమండలిలో మనకు అవసరమని ప్రజలందరూ ఆయన గెలుస్తారని తెలియజేశారు. శాసనమండలిలో విద్యావంతులు సభలో ఉంటే సభ సక్రమార్గంలో నడుస్తుందని, గ్రాడ్యుయేట్‌లకి ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని గతంలో మంత్రిగా చేసిన అనుభవం ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రాడ్యుయేట్స్ సమస్యలను శాసనమండలిలో వివరణాత్మకంగా సభకు తెలియజేయడం జరుగుతుందని రామయ్య తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో బూత్ ఇన్‌ఛార్జ్ ప్రవంతి, ఆలీ, పచ్చవ మల్లికార్జున, బ్రహ్మారెడ్డి, కోనపురెడ్డి నాగభూషణం, పోతల శ్రీనివాస్, ఎలమంచిలి ఫణీంద్ర పాల్గొన్నారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలి : దేవినేని ఉమా



మైలవరం (చైతన్యరథం): మైలవరం మండలం వెల్వడం గ్రామంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్థానిక గ్రామ మండల పార్టీ నేతలతో కలిసి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి బలపరచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపిద్దామన్నారు. బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, మండల పార్టీ ప్రెసిడెంట్లు, కూటమి ముఖ్య నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అందరినీ పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చి ఓటు వేసేలా చూడాలన్నారు. ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు ఓటర్ వెరిఫికేషన్, ఐడెంటిఫికేషన్ వంటి సమాచారాన్ని సేకరించి ప్రచారంపై దృష్టి పెట్టాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల స్ఫూర్తితో ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలన్నారు. మైలవరం నియోజకవర్గం తెలుగుదేశంపార్టీకి కంచుకోట అని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అదే అదే విజయంతో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాను గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులుగా ప్రతిరోజు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఆలపాటి రాజా విజయాన్ని కాంక్షిస్తూ...ఎమ్మెల్యే రాము ప్రచారం



గుడివాడ (చైతన్యరథం): రాష్ట్ర భవిష్యత్తు గురించి పట్టభద్రులందరూ ఆలోచించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సత్యనారాయణపురంలోని సిద్ధార్థ కళాశాల మరియు వార్డులోని పట్టభద్రుల ఇళ్లకు వెళుతూ ఎమ్మెల్యే రాము శనివారం ప్రచారం నిర్వహించారు. సిద్ధార్థ పాఠశాల ప్రిన్సిపల్ చోడవరపు విజయ్ కుమార్, కె.వి. కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ కొమ్ము వెంకటేశ్వర్లు మరియు ఉపాధ్యాయులు, పట్టభద్రుల్ని కలిసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించారన్నారు. ఓ వైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే.. మరో వైపు రాష్ట్రాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. ఈనెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా నిలవాలని పట్టభద్రులకు ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు.

## మంచి మెజార్టీతో ఆలపాటి రాజాను గెలిపించాలి : కూటమి నేతలు



పెడన (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టా భద్రుల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు పట్టభద్రులు అండగా ఉండాలని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, చైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు పెడన పట్టణం కూటమి నాయకులు కోరారు. శనివారం పెడన టౌన్ 4,5,6 వార్డులలో విస్తృతంగా పార్టీ నాయకులతో కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. సాధారణ ఎన్నికల్లో కూటమికి ఏ విధంగా అయితే మెజారిటీ ఇచ్చారో పట్టభద్రుల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కోరారు.

## ఉపాధ్యాయులంతా 'ఆలపాటి'ని ఆదరించాలి : వీరంకి గురుమూర్తి



కైకలూరు (చైతన్యరథం): విద్యారంగంతోపాటు ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యలపై అవగాహన ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఉపాధ్యాయ లోకమంతా ఆదరించాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి పిలుపునిచ్చారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్డీయే కూటమి తరపున పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా కైకలూరు నియోజకవర్గ పరిధిలోని కైకలూరులో ఎన్డీయే కూటమి నాయకులతో కలిసి గురుమూర్తి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని పట్టభద్రులను స్వయంగా కలిసి ఆలపాటి గెలుపు ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ.. విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యావ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, ముఖ్యంగా ఉపాధ్యాయులు గత ప్రభుత్వ హయాంలో పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావన్నారు. ఉద్యోగులపట్ల ఎంతో గౌరవం కలిగిన సీఎం చంద్రబాబు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా అనేక సంస్థలు ఏర్పాటుచేస్తున్నారని, రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్లు ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగుతున్నారన్నారు. ఇప్పటికే 4లక్షల మంది నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు ప్రభుత్వపరంగా చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు.

## కూటమి బలపరిచిన వ్యక్తికి ఓటేయండి... ఎన్నికల ప్రచారంలో బొండా ఉమా



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, రాబోయే ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నియోజకవర్గంలోని 27వ డివిజన్ పరిధిలోని దుర్గాపురం, బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు నేరుగా వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఓటును అభ్యర్థించారు. అనంతరం బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... కూటమి బలపరిచిన పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో ఒకటో నెంబర్ గుర్తుపై పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఈనెల 27వ తేదీన జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటుగా వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి పెద్దఎత్తున కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఆలపాటి రాజాకి పూర్తిస్థాయిలో రాజకీయ అనుభవంతో పాటు... పట్టభద్రుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఇప్పటికే మూడుసార్లు శాసనసభ్యులుగా, ఒకసారి మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు ఆలపాటి రాజా కృషి చేస్తారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని అన్నారు. ఈ నవ్యాంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికాభివృద్ధి రాష్ట్రంగా అభివృద్ధి చేసి నిరుద్యోగ సమస్యను రూపుమాపుతామని తెలిపారు. వైసీపీ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు జీతాలు సమయానికి అందేవి కావని, కానీ నేడు కూటమి పాలనలో ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందుతున్నాయని అన్నారు. రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బొండా ఉమామహేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్, నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పూల నాగరాజు, సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ డివిజన్ పార్టీ ఇన్‌ఛార్జ్ నవనీతం సాంబశివరావు, అధ్యక్షులు కొండపల్లి రూప్‌కుమార్, దాసరి నాగరాజు, మద్దాల రుక్మిణి, మంటాడ శివ, బందారు కొండ, దేశ వెంకటరావు, కొండపావులూరి బాబు, గుడివాడ దీపక్, హనుమంతరావు, డి.మార్ద్ రమణమ్మ, ఆటో యూనియన్ సురేష్, పసుపులేటి పిచ్చయ్య, విజయలక్ష్మి లతోపాటు వందలాదిమంది టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి అర్జీకి సమాధానం

## స్పెషల్ గ్రీవెన్స్‌కు పోటెత్తుతున్న అర్జీలు ఎమ్మెల్యే సోమిరెడ్డి వెల్లడి

ముత్తుకూరు, (చైతన్యరథం): ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వేపల్లిలో లెక్కకు మించిన సమస్యలతో ప్రజలు సతమతమయ్యారని పరిష్కారమడిగితే అరాచకాలు, దౌర్జన్యాల పాలయ్యారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ముత్తుకూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీని ఆన్ లైన్‌లో నమోదు చేసి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సర్వేపల్లి నియోజకవర్గంలో తనకు 2267 అర్జీలు వచ్చాయన్నారు. ప్రతి అర్జీని పీజీఆర్ఎస్‌లో రిజిస్టర్ చేస్తున్నామని, సమస్యల పరిష్కార ప్రక్రియను సీఎం కార్యాలయం పర్యవేక్షిస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలోనే అత్యధిక అర్జీలు, ఫిర్యాదులు సర్వేపల్లి నియోజకవర్గంలోనే వచ్చాయన్నారు. ఆ తర్వాత స్థానంలో 1000 అర్జీలతో ఆత్మకూరు నిలిచిందన్నారు. ముత్తుకూరు ప్రత్యేక గ్రీవెన్స్ తర్వాత సర్వేపల్లి ఎమ్మెల్యే లాగిన్‌లో అర్జీల సంఖ్య 2500 దాటిపోతోందన్నారు. కలెక్టర్‌తో పాటు అధికారులకు వచ్చిన అర్జీలతో కలుపుకుంటే సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి అర్జీల సంఖ్య 5333కు చేరిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో భూసర్వే ప్రక్రియలో తప్పులతడకలు, పీఓటీ పేరుతో దోపిడీ, జగనన్న కాలనీ పేరుతో అక్రమాలు, ఫ్రీహోల్డ్ పేరుతో మోసాలు, వీటన్నింటి ఫలితంగా అర్జీలు, ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా వెల్లువెత్తుతున్నాయన్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో సర్వేపల్లి నియోజకవర్గంలో దుర్మార్గపు పాలన జరిగిందనేందుకు వేలాదిగా వస్తున్న అర్జీలే నిదర్శనమన్నారు. ఇళ్ల స్థలాలు లేవని వందలాది అర్జీలు వస్తున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే కాకాణి ప్రజా సమస్యలను గాలికొదిలి దోపిడీకి పరిమితమయ్యాడన్నారు. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు మంజూరు చేయడంతో పాటు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలిచ్చామన్నారు. 150 గజాల (18 అంకణాలు) ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకున్న వారికి ఎలాంటి అభ్యంతరాలు లేకుండా జీఓ ఎంఎస్ 30 ప్రకారం తహసీల్దార్లే పట్టాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. 150 గజాల నుంచి 300 గజాలు(36 అంకణాలు) అయితే పట్టా మంజూరు అధికారాన్ని ఆర్డీఓకు కూటమి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. 300 నుంచి 500 గజాల స్థలానికి కలెక్టర్ పట్టా మంజూరు చేస్తారన్నారు. ముత్తుకూరు ప్రాంతంలో పారిశ్రామికీకరణ, జనాభా, కాలుష్యం పెరిగిన నేపథ్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. మత్స్య కళాశాలలో విద్యార్థులకు వసతుల కల్పనకు రూ.5.95 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు.





# అభివృద్ధికి మొదటి మెట్టు

### - సిద్దేశ్వరాలయ ముఖ ద్వారం ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

సీతారాంపురం, (చైతన్యరథం): సీతారాంపురం మండలం పొలం గారి పల్లి గ్రామ సమీపంలోని శ్రీ ఘటిక సిద్దేశ్వరాలయం వెళ్లే రహదారికి సుమారు 30 లక్షల రూపాయల వ్యయంతో అతి సుందరంగా అన్ని హంగులతో శ్రీ కోమర శెట్టి వెంకట సుబ్బారావు శుభ రత్నమ్మ దంపతులచే నిర్మించిన శ్రీశ్రీశ్రీ ఘటిక సిద్దేశ్వరాలయ ముఖద్వారాన్ని శనివారం ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా భారీ ఎత్తున బాణా సంచా పేల్చి పూల వర్షం కురిపిస్తూ పురోహితులు, స్థానిక నాయకులు ముఖద్వారా నిర్మాణ దాతలు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అత్యంత భక్తి శ్రద్ధలతో పురోహితుల మంత్రోచ్చారణల నడుమ కొబ్బరికాయ కొట్టి ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ ద్వారం అద్భుతంగా నిర్మించారని, దీనితో ఈ రహదారి శోభాయమానంగా మారిందన్నారు. భక్తి భావంతో ఇటువంటి కార్యక్రమాలు చేసే వారి వెన్నంటి ఉంటానని స్పష్టం చేశారు. ఈ ప్రాంతాన్ని, ఉదయగిరి కోటతో కలిపి పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలో 22 వాటర్ ప్లాంట్లను త్వరలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఏ గ్రామంలోనూ నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.దాతలను వారి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం సీతారాంపురం మండలంలోని పలు గ్రామాల సమస్యలను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి మార్గాలను తెలియజేశారు. వారి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ పొన్ను బోయిన చెంచల బాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు మాజీ జెడ్పిటిసి సభ్యులు కలివేల జ్యోతి ఎడమ ప్రవీణ్ కుమార్ ముత్తం శెట్టి చెన్నకేశవులు వెంగళ శెట్టి వెంకటేశ్వర్లు సంగారెడ్డి జాషువా ఇజ్రాయిల్ రఘురామయ్య ముత్తూరు వెంకటసుబ్బయ్య ఆదయ్య వికాస్ బాబు ఆలూరి శ్రీనివాసులు, రామచంద్రయ్య, వింజమూరు నాయకులు గణపం సుదర్శన్ రెడ్డి వనిపెంట సుబ్బారెడ్డి పాములపాటి మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

# నిరుద్యోగ రహిత ప్రాంతంగా కనిగిరి

### ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, (చైతన్యరథం): నియోజకవర్గాన్ని నిరుద్యోగ రహిత ప్రాంతంగా మార్చేందుకు ఎంప్లాయ్ మెంట్ రిజిస్ట్రేషన్ సెల్ ఏర్పాటు చేసినట్లు అన్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను అమరావతి గ్రౌండ్స్‌లో విడుదల చేశారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అర్హులైన వారిని గుర్తించి వారికి జాబ్ మేళా ఏర్పాటు చేసి తద్వారా ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం కనిగిరి ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# నిర్విఘ్నంగా గడపగడపకూ కోటంరెడ్డి

### 40వ రోజుకు 18 గ్రామాలు పూర్తి



నెల్లూరు రూరల్, (చైతన్యరథం): నెల్లూరు రూరల్ పరిధిలోని పొట్టేపాలెం గ్రామంలో 40వ రోజు ప్రారంభమైన గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శనివారం నాటికి 18 ఘ్రామాలు చుట్టేసింది. పొట్టేపాలెం గ్రామంలో కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి జనం ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తే ప్రజల వాస్తవిక సమస్యలు తెలుస్తాయని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్ఫూర్తితో గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగతున్నామని ప్రతి ఇంటికి వెళ్లి స్థానిక ప్రజలను పలకరించి వారి సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు.

# లూలూ మార్కెట్ అభివృద్ధి సాధించాలి

### ప్రారంభించిన టీడీపీ నేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి

కలకడ, (చైతన్యరథం): కలకడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన లూలు సూపర్ మార్కెట్‌ను శనివారం రాయచోటి నియోజకవర్గం టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి? యువ నాయకులు నిచ్చల్ నాగిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కలకడ మండలంలోని ప్రజలందరికీ అనుకూలంగా లూలు సూపర్ మార్కెట్ ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. చౌక ధరలకే అన్ని రకాల వస్తువులు ఈ మార్కెట్‌లో విక్రయించడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. లూలు సూపర్ మార్కెట్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా లూలు సూపర్ మార్కెట్ యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, నిచ్చల్ నాగిరెడ్డిని పూలమాలవేసి దృశ్యాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పరిమళించిన గొట్టిపాటి మానవత్వం

### వెల్లడైన డాక్టర్ లక్ష్మి ఔదార్యం

దర్శి, (చైతన్యరథం): మానవత్వం పరిమళించింది. సేవాదృక్పథమే అసలైన రాజకీయమని దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్పందనతో రుజువయ్యింది. ఓ శుభకార్యక్రమానికి హాజరు కావడం కోసం శనివారం డాక్టర్ లక్ష్మి దర్శి నుండి కురిచేడు బయలు దేరారు. మార్గమధ్యంలో సాగర్ కెనాల్ వెంకటాచలం పల్లి పంచాయతీ పరిధిలోని నడింపల్లి గ్రామానికి చెందిన పదిహేడేళ్ల యువకుడ పుప్పాల వీరనారాయణ ప్రమాద వశాత్తు కాలువలో పడిపోయాడు. అటుగా వెళ్తున్న డాక్టర్ లక్ష్మి అక్కడ గుమికుడిన ప్రజలను చూసి ఆగి విషయం తెలుసుకున్నారు. తక్షణం స్పందించారు. వెంటనే దర్శి డీఎస్పీ బి. లక్ష్మీనారాయణకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్ళను పిలిపించాలని సూచించారు. వీలైనంత త్వరగా ఈ యువకుడి ఆచూకీ తెలియజేయాలని కోరారు. వారి కుటుంబ సభ్యులకు ధ్యర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

### టీడీపీలో చేరిక

మండలం, రాజంపల్లి గ్రామం లో దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ డా౹౹ గొట్టిపాటి లక్ష్మీ గారి ఆధ్వర్యంలో వైసీపీ ని వీడి టిడిపి లో చేరిన వైసీపీ నాయకులు షేక్. మహబూబ్ జానీ తో పాటు 50 కుటుంబాల ముస్లిం సోదరులు. డాక్టర్ లక్ష్మితోపాటు టీడీపీ డైనమిక్ లీడర్ కడియాల లలిత్ సాగర్, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పార్టీ రాజంపల్లి గ్రామ నాయకులు ఉన్నారు. కూటమి పాలనలో ప్రజలు ఎంతో స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు.అందుకే కూటమి పాలన పట్ల ఆకర్షితులై రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా దర్శి ప్రాంతంలో అనేకమంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి మన జన రంజక కూటమి ప్రభుత్వం వైపు అడుగులు వేస్తున్నారన్నారు. షేక్ మహబూబ్ జానీ, షేక్ మీరవాలి, షేక్ చాంద్ బాషా, ఉప్పుతులా అనిల్, పేర్లమెట్ట మారుతీ, తదితరులు మొత్తం 50 కుటుంబాలు వైసీపీ ని వీడి టిడిపి లో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమం లో రాజంపల్లి గ్రామ నాయకులు దామా క్రిష్ణా, ఫణిదపు వెంకట్రామయ్య, నాగమణి ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, నీటి సంఘం అధ్యక్షులు కామిరెడ్డి ఎలుగొండారెడ్డి, ముస్లిం సోదరులు, అల్లాబక్షు, టెంట్ హౌస్ సుభాని, బట్ల షాప్ సుభాని టిడిపి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.



# టీడీపీలోకి చెముడుగుంట సర్పంచ్

### వార్డు సభ్యులు, వైసీపీ కీలక నేతలు

చెముడుగుంట, (చైతన్యరథం): టీడీపీ నేత కుంకాల దశరథ నాగేంద్ర ప్రసాద్ నాయకత్వంలో కుంచె రమేష్ ఆధ్వర్యంలో సర్పంచ్ పాముల రమణమ్మ, వార్డు సభ్యులు కుంచె శేషయ్య, భయ్యా శోభ, గెర్రె వెంకటయ్య, కత్తి బలరామయ్య, విజయ్, మేనపాటి ఉమ, యర్రబల్లి సునీల్, మొలకల సునీతమ్మతో పాటు కుంచె శివశంకరయ్య, కుంచె సురేష్ తదితర 20 కుటుంబాల వారు శనివారం టీడీపీలో చేరారు. వారికి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆత్మీయంగా ఆహ్వానం పలికారు.

# ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రాజెక్టులకు పాతర

**జగన్ సొంత జిల్లాలో మరీదారుణం**

**కూటమి హయాంలో ఊపందుకున్న పనులు**

**వైసీపీ పొలిట్‌బ్యురో సభ్యుడు శ్రీనివాసరెడ్డి**

కడప, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలోని హరిత టూరిజం ప్లాజాలో ఏర్పాటు



చేసిన రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాలలో వ్యక్తిగత కక్షలతో వైసీపీ ప్రభుత్వం అంతకముందు ప్రారంభమైన పనులను ఆపేయడమే కాకుండా, ఒక ప్రణాళిక లేకుండా పనులు చేసిందన్నారు. కడప వాసి ముఖ్యమంత్రిగా ఉండి 12, 500 కోట్ల రూపాయలకు ప్రాజెక్ట్ లకు జీవో లు విడుదల చేసి 100 కోట్ల పనులు కూడా పూర్తి చేయలేక పోయాడన్నారు. ఒక్క ప్రాజెక్టు పని కూడా సరిగా చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేసాడన్నారు. గత 5 సంవత్సరాలలో రైతులకు పంటలకు నీరు అందించకుండా రైతులని ఇబ్బందులకు గురిచేసిన విషయం అందరికీ గుర్తుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసిన ప్రాజెక్టులను అన్నింటినీ పూర్తి చేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతతోందన్నారు. ప్రారంభించిన ప్రాజెక్టులను అవసరమైన వాటికి కేంద్రం సహాయం తీసుకుని పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాయలసీమ రైతులకు నీరు ఇచ్చేందుకు కృషి చేస్తుంది. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.




# వెంటాడుతున్న వైసీపీ సమస్యలు

**ఎమ్మెల్యే సమక్షంలో వెల్లువెత్తిన అర్జీలు**

నందికొట్కూరు,(చైతన్యరథం) : నియోజకవర్గం పాములపాడు మండల పరిధిలోని, ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రీవెన్సెస్ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ పరిష్కార సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. పాములపాడు మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్ల వైసీపీ నిరంకుశ పాలనలో ఇబ్బందులు పడిన బాధితులు గ్రీవెన్సెస్ ప్రజా ఫిర్యాదుల సమావేశానికి పెద్ద సంఖ్యలో వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాములపాడు మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, సంబంధిత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి సీఎం చంద్రబాబు అండ

**స్వయంగా ఇంటికెళ్లి సాయమందించిన ఎమ్మెల్యే సింధూర సర్వత్రా ప్రశంసలు**

పుట్టపరి,(చైతన్యరథం) : నిరుపేదల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటి పెద్ద దిక్కుగా ఉంటారని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని జానకీ కళ్యాణ మండపం వెనుకవైపు ఉన్న ఉప్పు కాజా హుస్సేన్ సతీమణి మహమ్మదాబి అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలి ఇంటికి శనివారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్వయంగా వెళ్ళారు. ప్రభుత్వం



ఆరోగ్యశ్రీ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా ఆ కుటుంబానికి అందజేశారు. ఇలా ఇంటికి వచ్చిన వృద్ధురాలికి ఆర్థిక సహాయాన్ని అందించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ని పుట్టపర్తి ప్రజలు శభాష్ ఎమ్మెల్యే మేడం అని ప్రశంసించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన నిరుపేదలకు ఆసుపత్రిలో అయినా ఖర్చులను ప్రభుత్వం కొంత ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆ కుటుంబాలకు కొంత ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అండగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు అబ్దుల్ హుస్సేన్ పుట్టపర్తి టిడిపి నాయకులు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో**

# టీడీపీ అభ్యర్థులదే విజయం

రైల్వే కోడూరు, (చైతన్యరథం): బాపట్ల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద తరపున ప్రచారం నిర్వహించారు. బాపట్ల నియోజకవర్గంలోని వేదుల్లపల్లి స్టువర్టుపురం నందు స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బాపట్ల నియోజకవర్గంలో పర్యటించి ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం సహకరించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి బాధ్యతగా పనిచేద్దాం

**బాల్య వివాహాలు నిర్మూలించడంలో అధికారులు విఫలం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెల్లడి**

ఓడి చెరువు:(చైతన్యరథం) : ప్రజల సమస్యల పరిష్కారం కోసం అందరం సమష్టిగా పని చేద్దామని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పిలుపునిచ్చారు. ఓడి చెరువు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందర్భంగా ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాట్లాడారు. ముందుగా టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర ,మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల్ రెడ్డి, తుమ్మల మహబూబ్ బాషా, రాజారెడ్డి , పీట్లా సుధాకర్ ,గొల్లపల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, జౌళి బాబా , రామాంజనేయులు నాగేంద్ర, శ్రీనివాసులు , శంకర్ రెడ్డి ,శివారెడ్డి ,మల్లపల్లి ఓబుల్ రెడ్డి ,నిజాం ,సుధాకర్ లు ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందించి అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ,గ్రామాల్లో ప్రజలకు త్రాగునీటి సమస్య ఎక్కడ రానీవ్వొద్దని పేర్కొన్నారు . గ్రామాల్లో విద్యుత్ తాగునీటి సమస్యలు ఉన్నాయని తనకు ప్రజల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నట్లు అధికారులు దృష్టికి తీసుకుపోయారు. ఇకపై అలాంటి వాటిపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని అధికారులను



హెచ్చరించారు. అదేవిధంగా ఓడి చెరువు మండలంలో బాల్య వివాహాలు,యుక్త వయసులోనే బాలికల గర్భం దాల్చడం వంటి విషయాల్లో ఈ మండలం ముందు ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూర గుర్తు చేశారు. పుస్తకాలు మోసే వయసులో బాలికలు గర్భం దాల్చడం శోచనీయమని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు .ఇలాంటి పరిస్థితులు భవిష్యత్ లో రాకుండా ఐసిడిఎస్ ,వైద్య ఆరోగ్యశాఖ, స్థానిక పోలీస్ ,ప్రజాప్రతినిధులు అంగన్వాడి కార్యకర్తల సహకారంతో మహిళల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. ఇకపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో స్థానిక ప్రజాప్రతినిధులను కలుపుకొని ఇక గ్రూపును ఏర్పాటు చేసుకొని బాల్య వివాహాల నిర్మూలనకు హెల్ప్ లైన్ నెంబర్ 1098 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాల్లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకురావాలని అందుకు వాట్సాప్ లో గ్రూపును ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఏవీ కూడా స్థానిక ప్రజాప్రతినిధులకు సక్రమంగా తెలియడం లేదని ఇది చాలాదారుణ పరిస్థితి అని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఒక ప్రతి ఒక్క ప్రభుత్వ స్కీమును పేపర్ల ద్వారా కరపత్రాలు ద్వారా స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్వీన్ భాను వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి, సర్పంచులు రేణుకా బాయి, శంకర్ రెడ్డి ,ఎంపీటీసీ శ్రీనివాసులు , తహశీల్దార్ ఆనంద ఆచారి ఎంపీడీవో విల్సన్ రాబర్ట్, ఆర్డబ్ల్యూఎస్ జేఈ దీపికా , హౌసింగ్ ఏఈ అరుణ్ కుమార్, వ్యవసాయ అధికారి ఇలియాజ్ విద్యుత్ ఏఈ సదాశివ , పంచాయతీరాజ్ జేఈ మదన్ కుమార్ రెడ్డి , వైద్యాధికారి భాను, ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


# పేదల ఆరోగ్యానికి పెద్దపీట

**మంత్రి సవిత వెల్లడి**

**బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత**

పెనుకొండ :(చైతన్యరథం) : పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీటవేసిందని మంత్రి సవిత తెలిపారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 12 మంది బాధితులకు రూ. 5,63,816 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సీఎం చంద్రబాబు చికిత్స కోసం ఆసుపత్రులకు డబ్బు ఖర్చుచేసిన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూతనివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. అధికారంలోకి వచ్చి 8 నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలను తీసుకురావడం చంద్రబాబుకే సాధ్యమైందని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ముగింపు వేళ కుంభమేళాకు పోటెత్తిన భక్తులు

ప్రయాగ్లో కొనసాగుతోన్న కుంభమేళాకు మరికొద్ది రోజుల్లో ముగియనుంది. దీంతో ఆఖరి వారంలో పెద్దఎత్తున భక్తులు పోటెత్తుతున్నారు. పవిత్ర త్రివేణి సంగమంలో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 22 మధ్య దాదాపు 60 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించారని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. మహాకుంభ్ శక్తిని యావత్ ప్రపంచం కీర్తిస్తోందని ఆయన పేర్కొన్నారు. మన రాష్ట్ర సామర్థ్యం, అభివృద్ధిపై నమ్మకం లేనివారు కుంభమేళాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

ప్రతీ 12 ఏళ్లకు ఓసారి నిర్వహించే ఈ మహా కుంభమేళా జనవరి 13న మొదలుకాగా.. ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. మొత్తం 40 నుంచి 45 కోట్ల మంది రావచ్చని తొలుత అంచనా వేశారు. కానీ, ప్రపంచం నలుమూలల నుంచి నిత్యం సరాసరి కోటిన్నర మంది వరకు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్రాజ్కు వచ్చినట్లు యూపీ ప్రభుత్వం పేర్కొంది.

# ప్రధాని మోదీని కలిసిన ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా శనివారం ఉదయం ప్రధాని నరేంద్రమోదీని కలిశారు. కొత్తగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన ఆమె మర్యాదపూర్వకంగా ప్రధానిని కలిశారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ప్రధానితో భేటీ సందర్భంగా మోదీ ఆమెకు పలు సలహాలు, సూచనలు ఇచ్చినట్లు సమాచారం. అంతకుముందు రేఖా గుప్తా ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని తాను చదువుకున్న కాలేజీకి వెళ్లారు. అక్కడ ప్రిన్సిపల్, విద్యార్థులను కలిసి మాట్లాడారు.

ఈ సందర్భంగా రేఖాగుప్తా మాట్లాడుతూ.. ఇక్కడ చదివిన రేఖా గుప్తా మాత్రమే కాదు మీరంతా కూడా సీఎంలు కావాలని విద్యార్థులతో అన్నారు. కాలేజీ ప్రిన్సిపల్ మాట్లాడుతూ రేఖా గుప్తాకు తన ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. కాగా ఢిల్లీలో కొత్తగా కొలువుదీరిన బీజేపీ సర్కారు.. సోమవారం నుంచి అంటే ఫిబ్రవరి 24 నుంచి మూడు రోజులపాటు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించబోతోంది.

ఫిబ్రవరి 24న నూతన అసెంబ్లీ తొలి సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా ప్రొటెం స్పీకర్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ప్రొటెం స్పీకర్



కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు అందరిచేత ప్రమాణస్వీకారాలు చేయిస్తారు. అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 25న ఢిల్లీ ప్రభుత్వం అసెంబ్లీలో కాగ్ నివేదికను ప్రవేశపెట్టనుంది. కాగ్ నివేదికపై ఫిబ్రవరి 25, 27 తేదీల్లో చర్చ జరగనుంది.

# సైకిళ్లపై 1350 కి.మీ జర్నీ చేసిన తండ్రీకూతుళ్లు

**- కుంభమేళాకు వెళ్లి సంగమంలో పుణ్యస్నానాలు**

**- ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు!**



దిల్లీ సమీపంలోని గాజియాబాద్‌కు చెందిన తండ్రీకూతుళ్లు సైకిల్‌పై ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు వెళ్లారు. వందలాది కి.మీ ప్రయాణించి త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు చేసి తమ స్వస్థలానికి చేరుకున్నారు. ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తండ్రీకూతుళ్లు ఈ సైకిల్ రైడ్ చేపట్టారు.

గాజియాబాద్‌లోని వసుంధర ప్రాంతానికి చెందిన హోమియోపతి వైద్యుడు ఉమేశ్ పంత్ పుణ్య స్నానం కోసం తన కుమార్తె ఉమాంగ్ పంత్(19)తో కలిసి ప్రయాగ్‌రాజ్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో రూ.50 వేలు పెట్టి రెండు సైకిళ్లను కొనుగోలు చేశారు. గాజియాబాద్ నుంచి ఫిబ్రవరి 10న బయలుదేరి 650 కి.మీ ప్రయాణించి ఐదు రోజుల్లో ప్రయాగ్‌రాజ్ చేరుకున్నారు. అక్కడ పుణ్యస్నానాలు చేసి ఫిబ్రవరి 19కి స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ ప్రయాణానికి తండ్రీకూళుళ్లకు రూ.75,000 ఖర్చు అయ్యింది.

**ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు!**

"ప్రతిరోజూ దాదాపు 100-150 కిలోమీటర్లు సైకిల్‌ను తొక్కేవాళ్లం. మురీడు గంటలకొకసారి విశ్రాంతి తీసుకునేవాళ్లం. ప్రయాణంలో నా కూతురు చాలా ప్రోత్సాహం ఇచ్చింది. ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే మా సైకిల్ యాత్ర లక్ష్యం. ఈ కారణంగానే మేము మహా కుంభ్‌కు సైకిల్ మీద వెళ్లాం.

మహాకుంభ్‌కు వెళ్లేటప్పుడు ప్రజల నుంచి మాకు అపూర్వమైన మద్దతు లభించింది. చాలా చోట్ల ప్రజలు మాకు పూలమాలలతో స్వాగతం పలికి సత్కరించారు. ఈ ప్రయాణంలో మేము దాదాపు 10,000 మందికి ఆరోగ్యం గురించి అవగాహన కల్పించాం. ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లడానికి రెండు సైకిళ్లను కొన్నాను. ఒక్కో సైకిల్ ధర రూ.25,000. నేను ప్రతిరోజూ 30 కిలోమీటర్లు సైకిల్ తొక్కుతాను. శరీరం మన అత్యంత విలువైన ఆస్తి. దాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని ఉమేశ్ పంత్ తెలిపారు.

తొలుత ఉమేశ్ పంత్ సైకిల్‌పై కుంభమేళాకు వెళ్తానని అన్నప్పుడు కుటుంబ సభ్యులు భయపడ్డారు. కానీ ఉమేశ్ కూతురు ఉమాంగ్ పంత్ ఆయన్ను ప్రోత్సహించింది. ఈ క్రమంలో ఉత్తరాఖండ్‌లోని ఒక ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లో గ్రాడ్యుయేషన్ చేస్తున్న కూతుర్ని పిలిపించి కుంభమేళాకు ఉమేశ్ పయనమయ్యారు.

"ఇంటి నుంచి బయలుదేరి కొన్ని కిలోమీటర్లు సైక్లింగ్ చేసిన తర్వాత చాలా కష్టంగా అనిపించింది. కానీ ప్రయాణం ముందుకు సాగుతున్న కొద్దీ ఆ ఇబ్బందులు తొలగిపోయాయి. ఈ పర్యటనలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని కలిశాం. దారిలో ప్రజలు చాలా సహాయం చేశారు. మేము సైకిల్‌పై వెళు ్తంటే మా దగ్గరికి వచ్చి మాట్లాడేవారు. ఇది చాలా మంచి అనుభవం. మేము త్వరలో మరో సైకిల్ యాత్ర చేపట్టబోతున్నాం" అని ఉమేశ్ కుమార్తె ఉమాంగ్ పంత్ తెలిపారు.

# విరిగిన సీట్‌లోనే గంటన్నర ప్రయాణం

## - ఎయిర్ ఇండియాపై కేంద్రమంత్రి ఆగ్రహం

ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మండిపడ్డారు. ఇటీవల భోపాల్ నుంచి దిల్లీకి ప్రయాణించిన సందర్భంలో తనకు విరిగిపోయిన సీటు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు ప్రయాణికులను మోసం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించారు. ఎయిర్ ఇండియా నిర్వహణను టాటా గ్రూప్ తీసుకున్న తర్వాత ఎయిర్‌లైన్స్ సేవలు మెరుగుపడతాయని అనుకున్నానని.. కానీ అది తన అపోహేనని అర్థమయ్యిందని మంత్రి అసహనం వ్యక్తంచేశారు.



"విమానం ఎక్కిన వెంటనే నేను బుక్ చేసుకున్న సీటు విరిగి ఉండడంతో ఆశ్చర్యపోయాను. దీనిపై ఎయిర్‌లైన్స్ సిబ్బందిని ప్రశ్నించగా.. ఈ సమస్యను యాజమాన్యం ఆలస్యంగా గుర్తించిందని.. ఈ సీటు టికెట్‌ను ప్రయాణికులకు విక్రయించకూడదని ఆదేశించిందని తెలిపారు. విమానంలో అదొక్కటే కాకుండా మరిన్ని సీట్లు కూడా సరిగా లేవని సిబ్బంది చెప్పారు" అని కేంద్రమంత్రి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. తోటి ప్రయాణికులు తమ సీట్లలో కూర్చోమని ఆఫర్ చేశారని అన్నారు. కానీ వారికి ఇబ్బంది కలిగించడం ఇష్టం లేక తాను అదే విరిగిపోయిన సీట్లోనే గంటన్నర పాటు కూర్చొని ప్రయాణించానని తెలిపారు.

ప్రయాణికుల నుంచి పూర్తి ఛార్జీలు వసూలు చేసి, అసౌకర్యమైన సీట్లు కేటాయించడం ప్రయాణికులను మోసం చేసినట్లు కాదా అని మండిపడ్డారు. భవిష్యత్తులో అయినా ఎయిర్ ఇండియా యాజమాన్యం తమ ప్రయాణికులను ఇటువంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకుంటుందా లేదంటే వారి అవసరాన్ని సొమ్ము చేసుకోవడానికి వాడుకుంటుందా అని ప్రశ్నించారు. కేంద్రమంత్రి ట్వీట్‌పై ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ.. ఆయనకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

1932లో టాటా గ్రూప్ టాటా ఎయిర్ సర్వీసెస్ పేరుతో ఎయిర్ ఇండియాను స్థాపించగా.. స్వాతంత్ర్యం వచ్చాక 1953లో అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ఈ సంస్థను జాతీయం చేశారు. సుమారు 69 ఏళ్ల తర్వాత 2022లో ప్రభుత్వం విమానయాన సంస్థ ఎయిరిండియాను టాటా గ్రూప్ నకు అధికారికంగా అప్పగించింది.

# పాక్ జైలు నుంచి 22 మంది భారత జాలర్లు విడుదల

పాకిస్థాన్ కరాచీలోని మాలిర్ జైలులో ఉన్న 22 మంది భారతీయ జాలర్లు విడుదలయ్యారు. ఆయా జాలర్లను శనివారం భారత్‌కు అప్పగించే అవకాశం ఉన్నది. మత్స్యకారుల విడుదలపై మాలిర్ జైలు సూపరింటెండెంట్ అర్షద్ షా మీడియాకు సమాచారం ఇచ్చారు. ఈదీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఫైసల్ ఈదీ జాలర్లు లాహోర్‌కు చేరుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రయాణ ఖర్చులను భరించడంతో పాటు వారికి పలు కానుకలతో పాటు ఆర్థిక సహాయాన్ని సైతం అందించారు. జాలర్లు లాహోర్ నుంచి భారత్‌కు తిరిగి చేరుకోనున్నారు. జాలర్లు సుదీర్ఘంగా జైలు శిక్ష అనుభవించారని.. ఆయా కుటుంబాల వేదనను ఎత్తిచూపుతూ.. శిక్షాకాలం పూర్తయిన వెంటనే వారిని విడుదల చేసి స్వదేశానికి తిరిగి పంపేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దురుద్దేశం లేకుండా పాక్ జలాల్లోకి ప్రవేశించిన వారి



విషయంలో దయతో ఉండాలని కోరారు.

జాలర్లను పాక్ అధికారులు వాఘా సరిహద్దుకు తీసుకువచ్చి.. అక్కడ భారత అధికారులకు అప్పగించే ప్రక్రియను పూర్తి చేస్తారు. ఆ తర్వాత భారత అధికారులు వారిని సొంత ఊళ్లకు పంపేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. వాస్తవానికి ఒక దేశం జాలర్లు.. మరో దేశం జలాల్లోకి ప్రవేశించిన సమయంలో అరెస్టు చేస్తుంటారు. ఈ ఏడాది జనవరి ఒకటిన ఇరు దేశాలు ఖైదీల జాబితాను మార్పుడు చేసుకున్నాయి. ఈ జాబితా మేరకు.. పాకిస్థాన్‌లో 266 మంది భారతీయ ఖైదీలు ఉండగా.. ఇందులో 217 మంది జాలర్లు ఉన్నారు. ఇక భారత్‌లో 81 మంది జాలర్లు సహా 462 మంది పాక్ ఖైదీలు ఉన్నారు. ఇదిలా ఉండగా.. శ్రీలంక జైళ్లలో మగ్గుతున్న జాలర్లను విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని తమిళనాడు సీఎం స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శ్రీలంక నావికాదళం జాలర్లను భారీగా అరెస్టు చేస్తుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. జాలర్లు, వారి పడవలను తక్షణమే విడుదల చేసేలా దౌత్యపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మీరు మా దేశాన్ని.. మా గేమ్‌ను తీసుకోలేరు

## అమెరికా అధ్యక్షుడిపై కెనడా ప్రధాని ట్రూడో ఘాటు వ్యాఖ్యలు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించినప్పటి నుంచి పొరుగుదేశం కెనడాతో కయ్యానికి కాలుదువ్వుతున్న సంగతి తెలిసిందే. ఆ దేశంపై సుంకాలతో విరుచుకుపడటంతో పాటు కెనడాను 51వ అమెరికా రాష్ట్రంగా అభివర్ణిస్తూ వివాదానికి తెర లేపారు. ఈ పరిణామాల వేళ తాజాగా రెండు దేశాల మధ్య ఓ మ్యాచ్ జరిగింది. అందులో తమ దేశ జట్టు నెగ్గడంతో అమెరికా అధ్యక్షుడిపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఘాటు వ్యాఖ్యలు చేశారు.

బోస్టన్ వేదికగా 4 నేషన్స్ ఫేస్–ఆఫ్ ఐస్ హాకీ టోర్నమెంట్ జరిగింది. ఫైనల్ మ్యాచ్‌లో అమెరికా–కెనడా తలపడ్డాయి. ఈ మ్యాచ్‌కు ముందు ట్రంప్ దీనిపై స్పందిస్తూ.. "త్వరలోనే మన 51వ రాష్ట్రంగా మారే కెనడాపై గ్రేట్ అమెరికా హాకీ జట్టు విజయం సాధిస్తుందని విశ్వసిస్తున్నా" అని రాసుకొచ్చారు. అయితే, ఫైనల్ పోరులో కెనడా చేతిలో అగ్రరాజ్య జట్టు ఓటమి పాలైంది. దీంతో ట్రంప్ వ్యాఖ్యలకు ట్రూడో దీటుగా బదులిచ్చారు.



మ్యాచ్ అనంతరం తన ఎక్స్ ఖాతాలో 'మీరు మా దేశాన్ని తీసుకోలేరు.. మా గేమ్‌ను తీసుకోలేరు" అని కౌంటర్ ఇచ్చారు.

కెనడాపై అధిక సుంకాలు విధిస్తానని ట్రంప్ ఎన్నికల ప్రచారం నుంచే హెచ్చరిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. వలసలు, డ్రగ్స్ అక్రమరవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయాలని, లేనిపక్షంలో సుంకాలు పెంచుతానని అన్నారు. అంతేగాక, ఇందులో విఫలమైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడాను చేర్చుకుంటానని హెచ్చరించారు. ఈ క్రమంలోనే 'గవర్నర్ ఆఫ్ కెనడా' అంటూ ట్రూడోపై పలుమార్లు విమర్శలు గుప్పించారు.

ఈ నేపథ్యంలోనే అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత కెనడాపై 25 శాతం సుంకాలను విధించారు. ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. దీనికి ప్రతిగా.. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే కొన్ని వస్తువులపై తాము కూడా 25% సుంకం విధిస్తున్నట్లు ట్రూడో ప్రకటించారు. అనంతరం ఇరువురి మధ్య చర్చలు జరగడంతో ప్రతిపాదిత టారిఫ్లను కనీసం 30 రోజుల పాటు నిలిపివేసేందుకు అంగీకారం కుదిరింది.

## త్వరలో భారత్, చైనాపై ట్రంప్ ప్రతీకార సుంకాలు



త్వరలోనే భారత్‌తోపాటు చైనాపై ప్రతీకార సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఆ రెండు దేశాలు అమెరికా నుంచి ఎగుమతి అయ్యే వస్తువులపై అత్యధిక సుంకాలు విధిస్తున్నాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

'ఇండియా, చైనా దేశాలు ఎక్కువ సుంకాలు విధిస్తునాయి. అదే స్థాయిలో మేం కూడా పన్నులు విధిస్తాం. కంపెనీ లేదా దేశం ఏదైనా సరే సుంకాల విషయంలో పారదర్శకంగా ఉండాలని అమెరికా కోరుకుంటుంది. గతంలో మేం ఎప్పుడు అలా చేయలేదు. కానీ, ఇప్పుడు అందుకు సిద్ధమవుతున్నాం' అని ట్రంప్ అన్నారు.

ఇక గతవారం ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా కూడా ట్రంప్ సుంకాల అంశాన్ని ప్రస్తావించారు. అమెరికా దిగుమతులపై భారత్ అత్యధికంగా పన్నులు విధిస్తోందని, వ్యాపారం చేయటానికి కష్టమైన ప్రదేశమన్నారు. ఇక అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వాటిపై అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ కూడా ఉందని ఓ ఇంటర్వ్యూలో మస్క్ అన్నారు. ముఖ్యంగా ఆటో మొబైల్ రంగంలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే కార్లపై దాదాపు 100 శాతం సుంకాలను భారత్ విధిస్తోంది. ఆటో దిగుమతులపై భారత్ 100 శాతం పన్ను విధిస్తోందంటూ ట్రంప్ వ్యాఖ్యలను సమర్థించారు. భారత్ మాదిరిగా అనేక దేశాలు ఇలానే సుంకాలు విధిస్తున్నాయని ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను 25 శాతం పన్నులు విధిస్తే, ఇంత భారీగా పన్నులు విధిస్తారా అంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

## అక్కడ లంచం ఇస్తేనే భోజనం

### - ఉగాండా జైల్లో దారుణం
### - భారత సంతతి మహిళ ఆవేదన

భారత్ సంతతి చెందిన వ్యాపారవేత్త పంకజ్ ఓస్వాల్ కుమార్తె వసుంధర గతేడాది అక్టోబరులో ఉగాండాలో అరెస్టయ్యారు. కిడ్నాప్, హత్య అభియోగాలపై ఆమెను అరెస్టు చేసిన పోలీసులు కొన్నాళ్ల పాటు నిర్బంధంలో ఉంచారు. ఆ సమయంలో పోలీసులు తనతో చాలా దారుణంగా వ్యవహరించారని వసుంధర వెల్లడించారు. లంచం ఇస్తేనే తనకు ఆహారం, నీళ్లు ఇచ్చారని ఆరోపించారు. ఈ ఘటన జరిగిన దాదాపు నాలుగు నెలల తర్వాత తాజాగా ఆమె మీడియాతో మాట్లాడారు.

"ఆ రోజు పోలీసులు మా ఇంటికి వచ్చి వారెంట్ లేకుండా సోదాలు చేశారు. సెర్చ్ వారెంట్ అడిగితే ఇది యూరప్ కాదంటూ ఇష్టానుసారం మాట్లాడారు. ఇంటర్‌పోల్ డైరెక్టర్‌ను కలవాలంటూ బలవంతంగా నన్ను బయటకు తీసుకొచ్చారు. ఓ పురుష అధికారి నన్ను లాక్కెళ్లి వ్యాన్‌లో పడేశారు. ఆ తర్వాత ఐదు రోజుల పాటు నిర్బంధించారు. అనంతరం మరో రెండు వారాలు జైలుకు పంపించారు. ఆ సమయంలో నా ప్రాథమిక హక్కులకు తీవ్రంగా భంగం కలిగించారు."

"స్నానం చేయనివ్వలేదు. తిండి పెట్టలేదు. కనీసం నీళ్లు కూడా ఇవ్వలేదు. నాకు భోజనం, ఇతర కనీస సౌకర్యాలు కల్పించేందుకు నా తల్లిదండ్రులు పోలీసులకు లంచం ఇవ్వాల్సి వచ్చింది. ఒక దశలో నన్ను వాష్రూమ్కు కూడా వెళ్లనివ్వలేదు. క్రిమినల్ లాయర్‌ను అనుమతించ కుండానే.. బలవంతంగా నాతో వాంగ్మూలం రాయించుకున్నారు. హత్యలు, మానవ అక్రమ రవాణా వంటి కేసుల్లో నేరాలు చేసిన వారితో కలిపి జైలు గదిలో ఉంచారు. చనిపోయాడనుకున్న వ్యక్తి బతికే ఉన్నాడని తెలిసినా నన్ను జైల్లోనే ఉంచారు. ఎన్నో ప్రయత్నాల తర్వాత చివరకు బెయిల్



లభించింది" అని వసుంధర ఓస్వాల్ నాటి ఘటనలను గుర్తుచేసుకున్నారు.

### కేసు ఏంటీ..?

రాజస్థానకు చెందిన ముకేశ్ మేనరియాకు పంకజ్ ఓస్వాల్ కుటుంబం ఉద్యోగం ఇచ్చింది. అతను వారి ప్రైవేటు జెట్‌కు క్యాబిన్ సిబ్బందిగా పనిచేశాడు. తర్వాత వివిధ ప్రాంతాల్లోని వారి ఇళ్లకు సంబంధించిన వ్యవహారాలు చూసుకునేవాడు. అయితే 2023లో ఆ కుటుంబానికి, అతడికి మధ్య విభేదాలు తలెత్తడంతో ఉద్యోగం మానేశాడు. కొన్నాళ్లకు అతడు కన్పించకుండా పోవడంతో..

ముకేశ్‌ను కిడ్నాప్ చేసి, హత్య చేశారన్న ఆరోపణలపై గతేడాది అక్టోబరు 1న వసుంధర ఓస్వాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కొన్ని రోజులకు ముకేశ్ ఆచూకీ టాంజానియాలో లభించడంతో అదే నెల 21న ఆమెకు బెయిల్ లభించింది. గత డిసెంబరు 19న వసుంధరపై కేసును కోర్టు కొట్టేసింది.

## మరో ఆరుగురు ఖైదీల విడుదలకు సిద్ధమైన హమాస్

గాజాలో శాంతిస్థాపన కోసం ఇజ్రాయెల్ – హమాస్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. దీంతో 15 నెలలకు పైగా జరుగుతున్న భీకర పోరాటాన్ని పక్కన పెట్టి.. బందీలను, ఖైదీలను విడుదల ప్రక్రియను ప్రారంభించాయి. హమాస్ తమ చెరలో బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ పౌరులను విడతల వారిగా విడుదల చేస్తోంది. తాజాగా మరో ఆరుగురికి విముక్తి కల్పించేందుకు సిద్ధమైంది. అయితే, వారిని ఎప్పుడు బయటకు పంపిస్తారన్న దానిపై ఇంకా స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. ఆ మృతదేహం ఆమెదే.. మరోవైపు.. ఇటీవల హమాస్ పంపించిన ఒక మృతదేహం తమ దేశానికి చెందిన మహిళది కాదని ఇజ్రాయెల్ ఆరోపించింది. దీనిపై తీవ్ర దుమారం రేగింది. అయితే, ఆ మృతదేహం తమ కుమార్తెదేనంటూ మృతురాలి కుటుంబం తాజాగా ధ్రువీకరించడం గమనార్హం.

షిరి బిబాస్ అనే మహిళ, తన ఇద్దరు చిన్నారులు హమాస్ చెరలో ఇన్నాళ్లూ బందీగా ఉన్నారు. యుద్ధం



కారణంగా మహిళతో పాటు చిన్నారులు కూడా మృతి చెందారు. ఇటీవల ఆమె మృతదేహాన్ని ఇజ్రాయెల్‌కు పంపించారు.

అయితే, అది అసలు తమ దేశ పౌరురాలిది కాదని.. ఫోరెన్సిక్ అధికారులు ధృవీకరించారని ఇజ్రాయెల్ తెలిపింది. నిజానికి అది పాలస్తీనాకు చెందిన మహిళ శవంగా గుర్తించినట్లు పేర్కొంది. జరిగిన తప్పిదానికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. దీనిపై స్పందించిన హమాస్.. బందీలు ఉన్న ప్రాంతంపై ఐడీఎఫ్ దాడులు చేయడంతో చనిపోయిన వారి మృతదేహాలు చెల్లాచెదురయ్యాయని.. దానివల్లే అవశేషాలు కలిసిపోయి ఉండొచ్చంటూ వ్యాఖ్యానించింది. అయినప్పటికీ.. దీనిపై మరోసారి సమీక్ష జరుపుతామని తెలిపింది. ఈ పరిణామాల నేపథ్యంలో షిరి బిబాస్ కుటుంబం స్పందిస్తూ అది ఆమె మృతదేహమేనని తెలిపింది.

### కాల్పుల విరమణకు సిద్ధమైన హమాస్

శాశ్వత కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ అంగీకరిస్తే మిగిలిన బందీలందరినీ ఒకేసారి విడుదల చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని హమాస్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాజాలో శాశ్వత కాల్పుల విరమణకు తాము సిద్ధమే అని హమాస్ ప్రకటించింది. తమకు శాశ్వత కాల్పుల విరమణ కావాలని, పూర్తిస్థాయిలో గాజా నుంచి ఇజ్రాయెల్ దళాలు వైదొలగాలని.. ఇవే తమ లక్ష్యాలని పేర్కొంది. ప్రస్తుతం మొదటి విడత కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హమాస్, ఇజ్రాయెల్ మధ్య బందీలు, ఖైదీల మార్పిడి జరుగుతోంది.

# చరిత్ర సృష్టించిన ఆస్ట్రేలియా

## - ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే రికార్డ్ విజయం
## - అవలీలగా 352 లక్ష్యఛేదన
## - సెంచరీతో చెలరేగిన ఇంగ్లీస్


జోస్ ఇంగ్లీస్

351.. ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో ఇదే రికార్డు స్కోరు అనుకుంటే, ఇంగ్లాండ్ సాధించిన ఈ కళ్లు చెదిరే స్కోర్ నే ఛేజ్ చేసి 356 పరుగులతో భారీ విజయాన్ని నమోదు చేసింది ఆస్ట్రేలియా. ఈ రెండు భారీ స్కోర్లు కూడా తాజాగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్ లోనే నమోదు కావడం విశేషం. పైగా ఈ రెండిటితో పాటు రెండు అద్భుతమైన సెంచరీలు, ఓ అత్యధిక పరుగుల రికార్డు కూడా ఈ మ్యాచ్ లోనే ఆటగాళ్లు సాధించడం మరో విశేషం. ఫైనల్ గా ఈ మ్యాచ్ లో 5 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది ఆస్ట్రేలియా. ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే ఇది రికార్డు విజయం. ఈ విజయంలో 8 ఫోర్లు, 6 సిక్స్ ల సాయంతో 120 పరుగులు చేసిన ఇంగ్లిష్ కీలక పాత్ర పోషించాడు.

ఇంగ్లీస్ అదిరే శతకం..

352 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు 47.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మొత్తంగా 356 పరుగులు చేసింది. మ్యాథ్యూ షార్ట్ (66 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్స్ సాయంతో 63 పరుగులు), మార్నస్ లబుషేన్(45 బంతుల్లో 5 ఫోర్ల సాయంతో 47 పరుగులు), జోష్ ఇంగ్లిష్ (86 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్ ల సాయంతో 120), అలెక్స్ క్యారీ (63 బంతుల్లో 8 ఫోర్ల సాయంతో 69 పరుగులు) అద్భుతంగా రాణించారు. చివర్లో గ్లెన్ మ్యాక్స్ వెల్ (15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్ ల సాయంతో 32 పరుగులు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మార్క్ వుడ్, జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్సే, ఆదిల్ రషీద్, లియామ్ లివింగ్ స్టన్ తలో వికెట్ దక్కించుకున్నారు.


బెన్ డకెట్

ఐసీసీ వన్డే ఈవెంట్స్ లో హైయెస్ట్ సక్సెస్ ఫుల్ ఛేజ్ ఇదే(356)

ఆస్ట్రేలియా చేసిన రెండో అతిపెద్ద ఛేజ్ ఇదే

ఇంగ్లాండ్‌పై ఇదే అత్యధిక సక్సెస్ ఫుల్ ఛేజ్

పాకిస్థాన్ గడ్డపై రెండో అత్యధిక సక్సెస్ ఫుల్ ఛేజ్

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ అదిరే దూకుడు ప్రదర్శన చేసింది.

టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన ఇంగ్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 351 పరుగులు చేసింది. ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఈ ఇన్నింగ్స్ లో 95 బంతుల్లో సెంచరీ మార్క్ ను టచ్ చేసిన డకెట్.. మరో 39 బంతుల్లో 150 పరుగుల మార్క్ ను టచ్ చేశాడు. మొత్తంగా 165 పరుగులు చేశాడు. తద్వారా ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో చేరాడు. ఆస్ట్రేలియా ముందు ఇంగ్లాండ్ 352 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

### ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక స్కోర్లు ఇవే

**ఇంగ్లాండ్ 351/8 - ఆస్ట్రేలియాపై, 2025**

**న్యూజిలాండ్ 347/4 - 2004లో యూఎస్ఏపై**

**పాకిస్థాన్ 338/4 - 2017లో టీమిండియాపై**

**టీమిండియా 331/7 - 2013లో దక్షిణాఫ్రికాపై**

### 158 పరుగుల భారీ భాగస్వామ్యం..

బెన్ డకెట్‌తో పాటు జో రూట్ (78 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 68 పరుగులు) కూడా మంచిగా రాణించి అర్ధ శతకంతో మెరిశాడు. వాస్తవానికి ఓపెనర్ ఫిల్ సాల్ట్ (10), ఆ తర్వాత జేమీ స్మిత్ (15) త్వరగానే ఔట్ అవ్వడంతో ఇంగ్లాండ్ 43 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లోకి వెళ్తున్నట్లు కనిపించింది. కానీ అప్పుడే రూట్ తో కలిసి డకెట్ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో ఈ ద్వయం మూడో వికెట్‌కు 158 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నమోదు చేసింది.

చివర్లో లియామ్ లివింగ్ స్టోన్(14), జోఫ్రా ఆర్చర్ (21) పర్వాలేదనిపించారు. హ్యారీ బ్రూక్ (3) నిరాశపరిచాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో బెన్ ద్వారిషూస్ 3 వికెట్లు పడగొట్టగా.. అడం జంపా, మార్నస్ లబుషేన్ తలో రెండు వికెట్లు తీశారు. గ్లెన్ మ్యాక్స్ వెల్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.

# రోహిత్ శర్మ పాక్‌పై 60 బంతుల్లోనే సెంచరీ చేయగలడు

## - మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్

"కొద్దిసేపు సంయమనం పాటిస్తే పాకిస్థాన్‌పై భారత కెప్టెన్ రోహిత్ శర్మ సెంచరీ చేయగలడు. అదీనూ కేవలం 60 బంతుల్లో సాధిస్తాడు" అని టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ వ్యాఖ్యానించాడు. చాంపియన్స్ ట్రోఫీలో ఆదివారం భారత్ పాకిస్థాన్ జట్ల మధ్య దుబాయ్ వేదికగా మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత కెప్టెన్ రోహిత్ దూకుడుగా ఆడిన సంగతి తెలిసిందే. మరోసారి అదే ప్రదర్శన పునరావృతం చేయాలని రోహిత్‌కు యువీ సూచించాడు.

"రోహిత్ శర్మ తన ఫామ్‌ను కొనసాగిస్తే కేవలం 60 బంతుల్లోనే సెంచరీ బాదేస్తాడు. అతడి ఆటతీరు అలా ఉంటుంది. ఒక్కసారి కుదురుకున్నాడంటే.. కేవలం ఫోర్లే కాదు సిక్స్ తోనే పరుగులు రాబట్టేస్తాడు. షార్ట్ పిచ్ బంతులను ఆడటంలో అత్యుత్తమం. అలాగే 145-150 కి.మీ. వేగంతో వచ్చే బంతినీ అలవోకగా ఆడేస్తాడు. చాలా తేలికగా హుక్ చేసి బౌండరీగా మారుస్తాడు.. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించే ప్లేయర్" అని యువీ వెల్లడించాడు.

వారిద్దరికీ అసలు ఫామ్ పనే లేదు

"భారత కెప్టెన్ రోహిత్, సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లికి ఫామ్తో సంబంధమే లేదు. పరిమిత ఓవర్ల క్రికెట్లో మరీ ముఖ్యంగా వన్డేల్లో వారిద్దరూ మ్యాచ్ విన్నర్లు. రోహిత్ ఇబ్బందిపడుతూనే పరుగులు రాబడుతున్నాడు. అదే కాస్త కుదురుకుంటే ప్రత్యర్థికి మరింత ప్రమాదమే" అని యువీ తెలిపాడు.

ఆ విషయంలో మరో మాట లేదు: ఇంజమామ్

"ప్రస్తుతం భారత జట్టులోని ప్రతి క్రికెటరూ అద్భుతమైన ప్లేయర్లనడంలో అనుమానమే లేదు. అందులోనూ విరాట్, రోహిత్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. జట్టు విజయాల్లో గత రెండు దశాబ్దాలుగా ప్రభావం చూపిస్తున్నారు. ఒకవేళ వారిద్దరూ త్వరగా ఔటయ్యారంటే భారత డ్రెస్సింగ్ రూమ్ పరిస్థితి ఇబ్బందిగా ఉంటుంది. అలాగని మిగతా ప్లేయర్లు సరిగ్గా ఆడరని కాదు. పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ అజామ్ ఔటైనా మా జట్టులో ఇలాంటి పరిస్థితే ఉంటుంది. ప్రత్యర్థి బౌలర్లకు అప్పుడు మరింత ఉత్సాహం వస్తుంది. రోహిత్, విరాట్‌ను త్వరగా ఔట్ చేయగలిగితేనే పాక్‌కు అడ్వాంటేజ్" అని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ వ్యాఖ్యానించాడు.

## పాకిస్థాన్‌తో మ్యాచ్..

# 9 కేజీల బరువు తగ్గిన మహ్మద్ షమీ!



ఐసీసీ ట్రోఫీలు అంటే చెలరేగిపోతుంటాడు టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీ. రీసెంట్ గానే బంగ్లాదేశ్ తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ లోనూ ఐదు వికెట్ల ప్రదర్శన చేసి అదరగొట్టాడు. తద్వారా అత్యంత వేగంగా 200 వికెట్లు తీసిన బౌలర్‌గా ప్రపంచ రికార్డును సాధించాడు. అయితే తాజాగా పాకిస్థాన్ తో జరగబోయే మ్యాచ్ కు ముందు తన ఫిట్ నెస్ గురించి మాట్లాడాడు షమీ. '90 కేజీల ఉన్న శరీర బరువును తగ్గించుకోవడానికి మీరేం చేశారని'.. మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ అడిగిన ప్రశ్నకు ఆసక్తికరమైన సమాధానమిచ్చాడు.

***బిర్యానీ వల్ల తగ్గారా?***

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఫిట్ నెస్ సాధించడంలో భాగంగా తాను 9 కేజీల బరువు తగ్గినట్టుల పేర్కొన్నాడు మహ్మద్ షమీ.'నాకు తెలిసి రెండే కష్టమైన విషయాలు. ఒకటి అప్పు తీర్చడం, ఇంకొకటి బరువు తగ్గడం. అప్పు తీర్చాలంటే మెదడు కావాలి. మీరు 4 నుంచి 5 కేజీలు తగ్గారు. బరువు తగ్గడానికి మీరేం చేశారు?' అని సిద్ధూ అడగగా.. "నేను 9 కేజీలు బరువు తగ్గాను." అని నవ్వుతూ షమీ సమాధానం ఇచ్చాడు. దానికి నవజ్యోత్ సింగ్ సిద్ధూ నవ్వుతూ.. 'బరువు తగ్గడానికి బిర్యానీ సరైన మార్గమా' అని నవ్వుతూ మరోసారి ప్రశ్నించాడు.

***మనసుకు దగ్గర తీసుకుని చేస్తే..***

"ఒక విషయాన్ని లేదా పనిని మనసుకు తీసుకుని చేస్తే, అది సులువు అవుతుంది. నేను ఎన్‌సీఏలో ఉన్నప్పుడు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అప్పుడు నా బరువు 90 కేజీల వరకు పెరిగిపోయింది. ముఖ్యంగా అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే నా నాలుక. దీన్ని డీల్ చేయడం చాలా కష్టం. అయితే నేను స్వీట్లకు దూరంగా ఉన్నాను. నేను తినకూడని చాలా ఆహార పదార్థాలకు దూరంగా ఉన్నాను." అని షమీ అన్నాడు.

***అప్పటి నుంచి ఒంటిపూట భోజనం..***

"బిర్యానీ విషయానికొస్తే.. అది నాకు చిల్ మిల్ రన్స్. కొన్నిసార్లు అదే నా కోసం పరిగెడుతుంది. అయినా నేను 2015 నుంచి రోజుకు ఒక పూట మాత్రమే తినడం ప్రారంభించాను. బ్రేక్ ఫాస్ట్,లంచ్ ఏమీ చేయను. కేవలం డిన్నర్ మాత్రమే చేస్తాను. ఇది చాలా కష్టం. కానీ ఒక్కసారి దీన్నిపాటించడం ప్రారంభిస్తే, అవన్నీ సులభంగానే అనిపిస్తాయి." అని షమీ పేర్కొన్నాడు.

## బ్లో అప్

ప్రియాంక మోహన్



## ‘అఖండ 2’లో ఈ యంగ్ నటుడు కూడా




నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా నటించిన లేటెస్ట్ హిట్ చిత్రం “డాకు మహారాజ్” లేటెస్ట్ గానే ఓటిటిలో వచ్చి మళ్ళీ మంచి రెస్పాన్స్ ని కొల్లగొడుతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాలయ్య మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ చిత్రం “అఖండ 2 తాండవం” చేస్తున్న సంగతి తెలిసిందే. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న ఈ సినిమా మొదటి పార్ట్ కంటే మరింత గ్రాండ్ ఎలిమెంట్స్ తో తెరకెక్కిస్తున్నారు.

అయితే ఈ సినిమాలో తారాగణం పరంగా కూడా చాలా పక్కాగా ప్లాన్ చేస్తున్న బోయపాటి శ్రీను తన వైరం ధనుష్.. అదే ఆది పినిశెట్టిని కూడా కీలక పాత్ర కోసం తీసుకున్నట్టుగా ఆ మధ్య టాక్ వచ్చింది. అయితే ఈ సినిమాలో తాను ఉన్నట్టుగా ఆది లేటెస్ట్‌గా కన్ఫర్మ్ చేసాడు. ఈ చిత్రంలో ఆల్రెడీ తాను ఒక షెడ్యూల్ కూడా కంప్లీట్ చేసానని నెక్స్ట్ షెడ్యూల్ కోసం వెయిట్ చేస్తున్నట్టుగా రివీల్ చేసాడు. సో ఈ యువ నటుడు కూడా ఈ సినిమాలో కనిపించనున్నాడని చెప్పవచ్చు. ఇక ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తుండగా 14 రీల్ ప్లస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

## కంగనా ఎమర్జెన్సీ ఓటీటీ తేదీ ఖరారు



*కంగనా రనౌత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఎమర్జెన్సీ సినిమా చివరకు జనవరి 17న థియేటర్లలో విడుదలై మిశ్రమ స్పందనను అందుకుంది. అనేక వాయిదాల తర్వాత ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం 1975లో దేశంలో విధించిన అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో రూపొందించబడింది. ఇందిరా గాంధీ తన రాజకీయ జీవితంలో తీసుకున్న కీలక నిర్ణయాలు వాటి ప్రభావాలు దేశంలో ఏర్పడిన మార్పులను ఈ సినిమాలో ప్రదర్శించారు. కంగనా రనౌత్ ఇందిరా గాంధీ పాత్రలో నటించగా అనుపమ్ ఖేర్ జయప్రకాశ్ నారాయణ శ్రేయాస్ తల్పడే అటల్ బిహారీ వాజ్ పేయిగా నటించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది.*

*ఈ సినిమా దాదాపు రూ.60 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కగా థియేట్రికల్ రన్‌లో కేవలం రూ.21 కోట్ల వరకు మాత్రమే వసూలు చేసిందని సమాచారం. భారీ ప్రమోషన్లతో ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ కథన శైలి రాజకీయ అంశాల ప్రదర్శన కొంతమంది ప్రేక్షకులను ఆకట్టుకున్నా సమగ్రంగా చూస్తే సినిమా పెద్దగా విజయం సాధించలేకపోయింది. సినిమా విషయానికి వస్తే ఇందులో చూపించిన కొన్ని ఘట్టాలు ఆసక్తికరంగా ఉన్నప్పటికీ ప్రేక్షకుల మెప్పు పొందడంలో తడబడింది. ఫలితంగా ఈ చిత్రం థియేటర్లలో ఆశించిన స్థాయిలో లాభాలను రాబట్టలేకపోయింది. ఈ నేపథ్యంలో తాజాగా ఓటీటీ విడుదలపై కంగనా రనౌత్ అధికారికంగా ప్రకటించింది. తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా చేసిన అనౌన్స్‌మెంట్లో ఎమర్జెన్సీ మార్చి 17న నెటిఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుందని వెల్లడించింది. థియేటర్లలో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయిన ఈ సినిమా ఓటీటీ వేదికపై ప్రేక్షకుల నుంచి ఏ మేరకు స్పందన అందుకుంటుందో చూడాలి.*

## ‘రెడీ బాయ్స్’ అంటూ లాఠీతో వస్తున్న అర్జున్ సర్కార్



‘రెడీ న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ ‘హిట్-3’ ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు శైలేష్ కొలను ‘హిట్’ చిత్రాల ఫ్రాంచైజీలో మూడో పార్ట్‌గా తెరకెక్కిస్తున్నాడు. ఇక అర్జున్ సర్కార్ అనే రుత్‌లెస్ కాప్‌గా నాని విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా నుంచి టీజర్‌ను నాని పుట్టినరోజు కానుకగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు.

ఈ టీజర్‌తోనే సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పీక్స్‌కు తీసుకెళ్లేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది. దానికి తగ్గట్టుగానే ఈ టీజర్‌పై అభిమానుల్లో ఆసక్తిని క్రియేట్ చేస్తున్నారు. ఫిబ్రవరి 24న రిలీజ్ చేయనున్న ఈ టీజర్ కోసం అభిమానులు వెయిట్ చేస్తున్నారు. ఇక తాజాగా ఈ టీజర్‌పై మరింత ఆసక్తిని పెంచేలా ‘రెడీ బాయ్స్’ అంటూ నాని ఓ లాఠీ పట్టుకుని చెప్పే డైలాగ్ వీడియోను వదిలారు.

‘రక్తపాతం సృష్టించేందుకు అర్జున్ సర్కార్ సిద్ధం..’ అంటూ హిట్-3 మేకర్స్ ఈ టీజర్‌పై అంచనాలను పెంచుతున్నారు. ఇక ఈ సినిమాలో అందాల భామ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుంది. మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మే 1న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది.

## చీరకట్టులో చిలిపిగా మీనాక్షి చౌదరి



లక్కీ భాస్కర్ లో భార్య గా, తల్లి గా మీనాక్షి చౌదరి నటనను మెచ్చుకోని తెలుగు ప్రేక్షకుడు లేడు, స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌తో పోటీ పడి నటించిన మీనాక్షి చేసిన సుమతి పాత్ర అందరికి గుర్తుండిపోతుంది. కానీ మీనాక్షి చౌదరి మాత్రం కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి భార్య, తల్లి పాత్ర పోషిస్తే ఇక మీదట అలాంటి పాత్రలకే పరిమితమవుతానేమో అని కంగారు పడింది.

రీసెంట్ గా సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలో వెంకటేష్‌కి గర్ల్ ఫ్రెండ్ గా, పోలీస్ అధికారిగా సాదా సీదా పాత్ర చేసినా ఆ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవడం మీనాక్షి చౌదరికి బాగా హెల్ప్ అయ్యింది. సోషల్ మీడియాలో ట్రెండీ లుక్స్ తో మెస్మరైజ్ చేసే మీనాక్షి చౌదరి తాజాగా ఆకుపచ్చ చీరలో అద్దరగొట్టేసింది.

చీర కట్టులో సింప్లి సూపర్బ్ అనేలా మీనాక్షి లేటెస్ట్ లుక్ ఉంది. గ్రీన్ శారీ, డిజైనర్ బ్లౌజ్ లో మీనాక్షి సైడ్ లుక్ చూసి యూత్ మొత్తం ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం మీనాక్షి చేతిలో తెలుగులో నవీన్ పోలిశెట్టి అనగనగ ఒక రాజు చిత్రం మాత్రమే ఉంది.

## ‘విశ్వంభర’ నుంచి మొదట వచ్చేది ఈ పాటే!?

మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్‌గా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ ఫాంటసీ చిత్రం “విశ్వంభర” కోసం అందరికీ తెలిసిందే. అన్నీ బాగుండి ఉంటే ఈ పాటికి సినిమా రిలీజ్ అయ్యి థియేటర్స్ లో కూడా ఉండేది.

అయితే ఈ సాంగ్ పట్ల క్రేజీ బజ్ వినిపిస్తుంది. ఈ సాంగ్ రాముల వారిపై సాంగ్ కాగా కీరవాణి సాలిడ్ ట్యూన్‌ని అందించారట. అలాగే మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ కూడా కనిపించే సాంగ్ ఇదే అని తెలుస్తుంది. ఇక ఇదే సాంగ్ ని మేకర్స్ ఫస్ట్ సింగిల్ గా కూడా విడుదల చేస్తారని తెలుస్తుంది. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది.

## ఓటీటీ కాన్న ముందే టీవీలో.. ‘సంక్రాంతికి వస్తున్నాం’..



విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం. ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించారు. ఈ సంక్రాంతి పండుగకు ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది.

అయితే ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఓటీటీ లవర్స్‌కి షాక్ ఇస్తూ.. ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సినిమాను ఓటీటీ కంటే ముందుగా టీవీలో టెలికాస్ట్ చేయబోతున్నట్లు ప్రకటించింది.

మార్చి 01 సాయంత్రం 6 గంటలకు జీతెలుగులో ఈ సినిమా ప్రీమియర్ కాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. మరోవైపు ఈ చిత్రం ఓటీటీ తేదీ మరింత ఆలస్యం కాబోతున్నట్లు తెలుస్తుంది.



## నెట్ ఫ్లిక్స్‌లో డాకు మహారాజ్ విధ్వంసం

ఫిబ్రవరి 21న నెట్ ఫ్లిక్స్ నుంచి స్ట్రీమింగ్ లోకి వచ్చిన నందమూరి బాలకృష్ణ-బాబీ కాంబో డాకు మహారాజ్ చిత్రం టాప్ 1లో ట్రెండ్ అవడం నందమూరి అభిమానులకు పట్ట పగ్గాలు లేకుండా చేసింది. జనవరి 12న సంక్రాంతి స్పెషల్‌గా విడుదలైన డాకు మహారాజ్‌కు సూపర్ హిట్ టాక్ వచ్చింది.

మాస్ ఆడియన్స్‌ను డాకు మహారాజ్ బాగా ఇంప్రెస్స్ చెయ్యగా.. ఈ చిత్రం విడుదలైన రెండు రోజులకు వెంకటేష్ ఫ్యామిలీ ఫిలిం సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకోవడం డాకు మహారాజ్ కి మైనస్ అయ్యింది. అయినప్పటికీ అన్ని ఏరియాస్‌లో డాకు మహారాజ్ బ్రేక్ ఈవెన్ అయ్యి నిర్మాతను ఒడ్డున పడేసింది.

ఇక థియేటర్స్ లో విడుదలైన ఐదు వారాల గ్యాప్‌తో డాకు మహారాజ్ నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ లోకి రాగా.. ఇక్కడ ఓటీటీలోనూ డాకు మహారాజ్ విధ్వంశం సృష్టిస్తుంది. పాన్ ఇండియా భాషల్లో ఓటీటీలో విడుదలైన ఈ చిత్రం అదరగొడుతుంది. నెట్ ఫ్లిక్స్ లో ఇండియా వైడ్ గా డాకు మహారాజ్ ట్రెండ్ అవుతుంది. ఓటిటిలో వచ్చాక డాకు మహారాజ్ ఆడియెన్స్ నుంచి మంచి ప్రశంసలు అందుకుంటుంది.